Crime Mirror
QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్
18-10-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 345

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం

## మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం

- మూడు నెలలు కెటిఆర్, హరీస్, ఈటెల అక్కడ ఉంటారా
- వారికి సకల సౌకర్యాలు కలిగించి ఉంచుతాం
- పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా
- మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సిఎం రేవంత్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని

- మిగతా 2వ పేజీలో

# సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి

- గాలికి కొట్టుకు పోయిన బాబు సూపర్ సిక్స్‌లు
- కేబినేట్‌లో ఒక్కటైనా ఎందుకు చర్చించలేదు
- ఉద్యోగాల కల్పనపై మోడీతో శ్వేతపత్రం విడుదల చేయండి
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ షర్మిల



**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** ఎన్నికల ముందు పథకాల పేరుతో మభ్యపెట్టి.. అధికారం చేపట్టాక ఆ హామీలను అమలు చేయడం లేదనికూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన వైఎస్ షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'నిన్నటి క్యాబినెట్ మీటింగ్‌లో సూపర్ సిక్స్‌లో ఒక్క సిక్స్ గురించి అయినా చర్చిస్తారు.

మిగతా 2లో




# సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్

2లో

# మద్యం ధరలపై కన్నేసిన ప్రభుత్వం

ధరలు పెంచే యోచనలో సర్కార్



# బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

- తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం మన పార్టీయే
- ఇది కెసిఆర్, కెటిఆర్‌దో కాదు...తెలంగాణ ప్రజలది
- కాంగ్రెస్ పాలనలో దోపిడీ పెరిగింది
- బిజెపి మత రాజకీయాలు చేస్తోంది
- బిఆర్ఎస్‌వి సమావేశంలో కెటిఆర్ విమర్శలు




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు.

మిగతా 2లో



## అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, చంద్రబాబు

**చండీగఢ్,(క్రైమ్ మిర్రర్):** హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలకుగానూ 48 చోట్ల బీజేపీ గెలుపొందింది. గవర్నర్ బండారు దత్తాత్రేయ.. నాయబ్ సింగ్‌తో ప్రమాణం చేయించారు.

2లో

# జమిలి ఎన్నికలు వస్తే సిద్ధంగా ఉండాలి



- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైకాపా సిద్ధం
- ప్రజల్లోకి మనం ధైర్యం వెళుతున్నాం
- అధికార టిడిపి ప్రజల్లోకి వెళ్లేందుకు జంకు
- ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చతికిల పడ్డారు
- దొంగకేసులతోనే పోలీసులకు సరిపోతోంది
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన జగన్

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** జమిలి ఎన్నికలు అంటున్నారని, అందువల్ల మనమంతా అందుకు సిద్ధంగా ఉండాలని వైకాపా అధినేత వైస్ జగన్ అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తగిన సమయం ఉంటుందని, పార్టీని మరింత పటిష్టం చేయడానికి మంచి అవకాశం ఉంటుందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. ప్రతిక్షంగానూ, అధికారంలోనూ, మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంగానూ పార్టీ ఉందన్నారు.

2లో



## తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి

- మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు సజ్జల
- పోలీసుల తీరుపై పొన్నవోలు ఆగ్రహం

**గుంటూరు, (క్రైమ్ మిర్రర్):** వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారించాలని మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆయన గురువారం

2లో

క్రైమ్ మిర్రర్
తెలంగాణ
2 శుక్రవారం 18-10-2024

## మద్యం ధరలపై కన్నేసిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. మద్యంతో ఎంజాయ్ చేస్తున్న మందుబాబులకు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పెద్ద షాకే ఇవ్వబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి.

## అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ , ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. సీఎంతోపాటు అనిల్ విజ్, క్రిషన్ లాల్ పన్వార్, రావ్ నర్బీర్ సింగ్, మహిపాల్ ధండా, విపుల్ గోయెల్, అరవింద్ కుమార్ శర్మ, శ్యామ్ సింగ్ రాణా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం ఉంది. సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగియడంతో పంచ్‌కులాలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే విస్తృత సమావేశం జరిగింది. దీనికి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలు, జనగణన, ఉమ్మడి పౌర స్మృతి తదితర కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నాయి. బీజేపీకి, ఎన్డీయే పార్టీలకూ మధ్య సమన్వయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయవచ్చని, ఇదే సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ 48, కాంగ్రెస్ 37 సీట్లలో గెలుపొందాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ హరియాణాలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అంచనా వేసింది. 90 స్థానాల్లో 67.9 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపొందిన సీనియర్ నేతల్లో నయాబ్ సింగ్ సైనీతో పాటు, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా, ఃఏఖ నేత అనిల్ విజ్ (అంబలా కాంట్), శ్రుతి చౌదరి (తోషమ్), ఎఔఒఆ అర్జున్ చౌతాలా తదితరులు ఉన్నారు.

## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో ఎమికస్ క్యూరీగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలు అందించారు. ఆ తరువాత 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామితులయ్యారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించకుండానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఎలక్టోరల్ బాండ్స్, ఆర్టికల్ 370 తొలగింపు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ సంబంధిత కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పాత్ర కీలకమైంది. కాగా నవంబరు 11న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటిరోజు అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు 9 న జస్టిస్ యూయూ లలిత్ స్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో రెండేళ్ల పాటు సీజేగా ఉన్నది చంద్రచూడ్ మాత్రమే. అంతేకాదు, జస్టిస్ చంద్రచూడ్ తండ్రి జస్టిస్ విశ్వనాథ్ చంద్రచూడ్ సుప్రీంకోర్టు 16 ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అత్యధికాలం సీజేఐగా పనిచేసింది కూడా ఆయనే. ఏకంగా 7 సంవత్సరాల 139 రోజుల పాటు పదవీలో కొనసాగారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి

విచారణకు హాజరయ్యారు. సజ్జల వెంట న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తదితరులు ఉన్నారు. సజ్జలతో పాటు విచారణాధికారి వద్దకు తనను కూడా అనుమతించాలని పొన్నవోలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వేలు చూపించి మరీ పోలీసులను బెదిరించారు. అయితే, విచారణ సమయంలో న్యాయవాదులను పోలీసులు అనుమతించలేదు. దీనికి కోర్టు అనుమతి తప్పనిసరి అని, ప్రస్తుతం విచారణకు సజ్జలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీంతో సజ్జల ఒక్కరే పోలీస్‌స్టేషన్ లోకి వెళ్లారు. మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, గ్రామీణ సీఐ శ్రీనివాసరావు విచారిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డికి న్యాయస్థానం ఈనెల 24 వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే 10న లుక్‌ఔట్ నోటీసులు ఎలా ఇస్తారని న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దాడి జరిగిన రోజు సజ్జల మంగళగిరికి 500 కి.మీ దూరంలో ఉన్నట్టు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పించామన్నారు. పోలీసులకు విచారించే అధికారం ఉన్నట్టు.. నిందితులకూ హక్కులు ఉన్నాయన్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసును రకరకాలుగా తిప్పుతున్నారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. దీనిపై కేసు నమోదు కావడంతో ఇప్పటికే పలువురు వైకాపా నేతలను పోలీసులు విచారించారు. ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయం పై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్‌లను ఇప్పటికే పలు దఫాలుగా పీఎస్‌కు పిలిపించి విచారించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సజ్జలను విచారిస్తున్నారు.

# మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేములఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు



ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్టాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కటైనా అమలు చేస్తారని అనుకున్నాం. మహిళలకు శుభవార్త చెప్తారని అనుకున్నాం. ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఈ రెండూ లో బడ్జెట్ స్కీమ్‌లు. వీటిని అమలు చేస్తారని భావించాం. కానీ, ఎక్కడా వాటిని ప్రస్తావించలేదు. బాబు సూపర్ సిక్స్‌లు గాలికి కొట్టుకు పోయాయి. కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయి. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదే. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు రావాలి. రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తామన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాబ్ ఫస్ట్ అనేది తమ నినాదం అని సీఎం చంద్రబాబు చెప్పారని షర్మిల గుర్తు చేశారు. 'మాటలన్నీ బాగానే చెప్పారు. కానీ, ఇక్కడే బిలియన్ డాలర్ల ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? 2014లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు. అమరావతిని సింగపూర్ అన్నారు. 3ఆ గ్రాఫిక్స్ చూపించారు. అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి తేడా లేదు. పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టారు. చంద్రబాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుంది అనిపించింది. పాత గిఫ్ట్ కొత్త బాక్స్‌లో ఇస్తున్నారు. ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయని సందేహం వ్యక్తం చేశారు. 'సీఎం చంద్రబాబును ఒక విషయంలో స్వాగతిస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదం మంచిదే. రాష్ట్రంలో నిరుద్యోగం తారా స్థాయిలో ఉంది. ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు. గత 10 ఏళ్లుగా పరిశ్రమలు లేక యువత వలసలు వెళ్ళింది. రాష్ట్రానికి నిరుద్యోగం అతి పెద్ద సమస్య. నిన్న చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు 50 లక్షల మంది ఉన్నారు. ఈ లెక్కన బాబు చెప్పినట్లు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తే..5 ఏళ్లలో 20 లక్షలు ఇస్తారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల కల్పన జరిగితే మిగతా వాళ్ల సంగతి ఏంటి..? ఉద్యోగాలు అని గతంలో మోడీ బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసింది. 20 కోట్ల ఉద్యోగాలలో మనకు ఎన్ని వచ్చాయి ? ఒక్క ఉద్యోగం ఇవ్వని మోడీకి ఎందుకు చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నారు ? రాష్ట్రంలో మీరు ఇచ్చే 20 లక్షలకు తోడు మరో 30 లక్షల ఉద్యోగాలు మోడీ ఇవ్వాలి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు డిమాండ్ చేయాలి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరు కలిసి కూర్చొని ఉద్యోగాల కల్పన పై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి.' అని షర్మిల డిమాండ్ చేశారు.'రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాల కల్పన చేస్తామని చెప్పిందో.. ప్రధాని మోదీ కూడా అన్ని ఉద్యోగాలు ఇవ్వాలి. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల పరిధిలో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారో శ్వేత పత్రం విడుదల చేయాలి. గత 10 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది తేల్చాలి. జాబ్ క్యాలెండర్ ప్రకారం అన్ని పోస్టులు భర్తీ చేయాలి. లోకేష్.. మోదీకి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారట.

## బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించుకున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ.

## జమిలి ఎన్నికలు వస్తే సిద్ధగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

అన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో వైఎస్ జగన్ సమావేశం అయ్యారు. ప్రజల్లోకి మనం ధైర్యంగా వెళ్లగలుగుతామని.. టీడీపీ కూటమి కార్యకర్తలు ధైర్యంగా వెళ్లగలుగుతారా అంటూ జగన్ ప్రశ్నించారు. టీడీపీ వాళ్లు ప్రజల ఇళ్లకు పోయే పరిస్థితులు లేవన్నారు. ప్రతి కుటుంబానికి మంచి చేసే కార్యక్రమాలు మనం చేశామన్నారు. కాని, చంద్రబాబుగారు అబద్దాలకు రెక్కలు కట్టారని విమర్శించారు. ప్రతి ఇంటికీ వైసీపీ నాయకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేశారని.. అమలు చేసిన హామీలే వైసీపీకి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రిపేర్‌గా ఉండాల్సిన సమయం వచ్చిందన్నారు. 15 ఏళ్లలో పార్టీ ప్రస్థానం ముందుకు సాగిందన్నారు. కాకపోతే మనం ఆర్గనైజ్డ్‌గా యుద్ధంచేస్తున్నామా? లేదా? అన్నది చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థీకృతంగా ముందుకు సాగితేనే అది మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. అప్పుడే మనం రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ ఎఫెక్టివ్‌గా ఉంటామని పేర్కొన్నారు. జమిలి అంటున్నారు.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆర్గనైజ్డ్‌గా ఉంటే మన సన్నద్ధంగా ఉంటామని పార్టీ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్ర స్థాయి నుంచిజిల్లాల వరకూ కమిటీలు ఎలా ఉన్నాయి? అన్నదానిపై పరిశీలన, అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ పాత్రలను నిర్వర్తించాలన్నారు. మరో ఆరు నెలల్లో మళ్లీ సమావేశం ఏర్పాటయ్యే నాటికి గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు కావాలని సూచించారు. అనుబంధాల విభాగాలకు గ్రామస్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. బూత్ కమిటీలు కూడా ఏర్పాటు కావాలని వైఎస్ జగన్ పేర్కొన్నారు. కమిటీలు ఏర్పాటన్నది కాగితాలకే పరిమితం కాకూడదన్నారు. దానివల్ల పార్టీకి ఎలాంటి లాభం ఉండదని.. కమిటీల ఏర్పాటుపై పర్యవేక్షణ, పరిశీలన ఉండాలన్నారు. ఇలాచేయగలిగితే.. దేశంలోకెల్లా నంబర్ ఒన్ పార్టీగా మనం ఎదుగుతామన్నారు. గ్రామస్థాయి నుంచి మనకు కమిటీలు, నాయత్వం లేక కాదన్నారు. కాకపోతే వీటిని నిర్మాణాత్మక వ్యవస్థల్లోకి తీసుకురావాలని.. గ్రామస్థాయిలో కూడా నిర్మాణాత్మకంగా ఉండాలని వైసీపీ నేతలకు సూచించారు.

# దేశం గర్వించదగ్గ గిరిజన వీరుడు

### కుమ్రం భీం 84వ వర్ధంతికి కెటిఆర్ నివాళి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** దేశం గర్వించదగ్గ గిరిజన తిరుగుబాటు వీరుడు, గోండు బెబ్బులి కుమ్రం భీం 84వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆదివాసీ యోధుడు, అరణ్య సూర్యుడు, పోరాటాల పోతుగడ్డ మీద పుట్టిన అడవి తల్లి ముద్దుబిడ్డ అని చెప్పారు. ఉద్యమ బాటలో, ఉజ్వల ప్రగతి దారిలో జల్.. జంగల్.. జమీన్ నినాదమే స్ఫూర్తిగా కొమురం భీం ఆశయాల అడుగు జాడల్లో పయనించామని తెలిపారు. కొండల్లో కోనల్లో వున్న ప్రతి గూడేనికి, తండాకు స్వచ్ఛమైన మంచినీళ్ల సరఫరాతో విష జ్వరాల చావుల నుంచి విముక్తి కల్పించామని వెల్లడించారు. 4 లక్షల ఎకరాలకుపైగా పోడు భూములపై హక్కులు కల్పిస్తూ.. అడవి బిడ్డలకు పట్టాభిషేకం చేశామని గుర్తుచేశారు. మావనాటే మావరాజ్.. 'మా గూడెంలో మా తండాలో మా రాజ్యం' ఆకాంక్ష స్వరాష్ట్రంలో నెరవేరిందని చెప్పారు. 2,471 గిరిజన పంచాయతీల్లో స్వయం పాలనా జెండా ఎగిరిందని అన్నారు. అవకాశాల్లో జనాభా దామాషా ప్రకారం సముచిత వాటా దక్కేలా గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. 188 గురుకుల పాఠశాలలు, 125 గురుకుల ఇంటర్ కాలేజీలు, 22 గురుకుల డిగ్రీ కళాశాలలతో అడవి బిడ్డల విద్యా వికాసానికి నిబద్ధతతో కృషి చేశామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ తో విదేశీ చదువుల కలలు సాకారం, గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దిన సీఎంఎస్టీఈఐ స్కీం, ఆ మహనీయుని పేరుతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున నిర్మించిన కుమరం భీం ఆదివాసీ భవన్, సేవాలాల్ బంజారా భవన్లు గిరిజన అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. గిరిజన సంస్కృతికి గొప్ప గౌరవమైన సమ్మక్క సారక్క జాతర, నాగోబా, జంగుబాయి, చెంచుల బౌలాపూర్, ఎరుకల నాంచారమ్మ, గాంధారి మైసమ్మ, కొలాం పండుగలకు భారీగా నిధులు

# మహిళ మీద కన్నేసి బాలిక హత్య

### సూరారం బాలిక మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

**మేడ్చల్, (క్రైమ్ మిర్రర్):** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో దసరా పండుగ రోజు జరిగిన దారుణ ఘటనపై పోలీసులు కూపీ లాగి ఛేదించారు. అదృశ్యమైన ఏడేళ్ల చిన్నారి చివరికి ఓ సంచిలో మృతదేహమై కనిపించడంతో కేసు విషాదాంతమైంది. ఈ కేసును మేడ్చల్ జిల్లా సూరారం పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. వివాహిత మీద కన్నేసిన నిందితుడు ఆమె కుమార్తెను హత్య చేశాడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పాటగూడ గ్రామానికి చెందిన మిశ్రమ్ ప్రభాకర్ (40) ఏడు నెలల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇద్దరు కుమార్తెలు ఉన్న గ్రామానికే చెందిన మహిళతో కలిసి కుత్బుల్లాపూర్ పరిధి సూరారం జీవన్ జ్యోతినగర్ లో ఉంటున్నాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిళకు ఇద్దరు కూతుళ్లు కాగా, పెద్ద కూతురు జోష్న వయసు ఏడేళ్లు. ఈ క్రమంలో ప్రభాకర్ కు ఆ ప్రాంతానికే చెందిన తిరుపతి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రభాకర్ తన ఇంట్లోనే తిరుపతితో కలిసి తరుచూ మద్యం సేవించేవాడు. ఆ క్రమంలో ప్రభాకర్ ఇంట్లో ఉన్న మహిళపై తిరుపతి కన్నేశాడు. ఇద్దరు పిల్లలు, ప్రభాకర్ అడ్డు తొలగించుకుంటే ఆ వివాహితను తన సొంతం చేసుకోవాలని భావించాడు. తన ప్లాన్ ప్రకారం అక్టోబర్ 12న ఉదయం వివాహిత పెద్ద కుమార్తె (7)ను తన ఇంటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం తిరుపతి ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ప్రభాకర్ ఇంట్లో వదిలేశాడు. సాయంత్రం మరోసారి ప్రభాకర్ ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరని తెలుసుకున్నాడు. దాంతో బాలికకు మరోసారి మాయ మాటలు చెప్పి బైకు మీద తీసుకెళ్లాడు. అయితే రాత్రి అయినా బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో ప్రభాకర్, మహిళ కలిసి సూరారం పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యమైందని ఫిర్యాదు చేసి వివరాలు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలతో బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో మేడ్చల్ పోలిస్‌స్టేషన్ పరిధి బాసరేగడి గ్రామం సమీపంలో ఓ సంచిలో బాలిక మృతదేహం కనిపించింది. ఆ డెడ్ బాడీ అదృశ్యమైన చిన్నారిదేనని నిర్ధారించారు. బాలిక కనిపించకుండా పోయిన తరువాత నుంచి తిరుపతి జాడ లేకపోవడంతో పోలీసుల ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టారు. బాలికను బైకు మీద తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా ద్వారా గుర్తించిన పోలీసులు మంగళవారం నిందితుడు తిరుపతిని అరెస్ట్ చేశారు.నిందుతుడు తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చిన్నారిని బైకు మీద తీసుకెళ్లిన తిరుపతి బాసరగడి గ్రామం దగ్గర కత్తితో చిన్నారి గొంతు కోశాడు. కడుపుతో సైతం కత్తితో పొడిచి బాలికను చంపినట్లు నిందితుడు తిరుపతి అంగీకరించాడు. బాలిక మృతదేహాన్ని ఓ సంచిలో మూటకట్టి సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేసి పారిపోయినట్లు తెలిపాడు.

# పత్తి మద్దతు ధరలపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ఒకే దేశం-ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్ అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం- ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష? గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణకు రూ.7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా? అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బతుకమ్మ చీరలపై పొంతనలేని మాటలు

### చీరలు లేకుండానే ముగిసిన బుతకమ్మ

### సీతక్క మాటలు అర్థం లేనివంటూ హరీష్ విమర్శలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రతి బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చీరలను పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఆ బతుకమ్మ చీరలతో ఆడబిడ్డలు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేవారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరలు మాయమయ్యాయి. బతుకమ్మ చీరలపై ప్రజలు ప్రశ్నిస్తే.. మంత్రులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. కేసీఆర్ ఏటా ఇచ్చే బతుకమ్మ చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఎందుకు బంద్ చేసిందన్న దానికి సమాధానం చెప్పకుండా మంత్రి సీతక్క పొంతన లేని వ్యాఖ్యలు చేయడం శోచనీయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మా ప్రభుత్వం ఏటా రూ. 300 కోట్లతో బతుకమ్మ చీరెలు పంపిణీ చేసిందని ఒప్పుకున్నందుకు ముందుగా మీకు ధన్యవాదాలు అని సీతక్కను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అయితే అంతకు మించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు కల్పించినట్లు భ్రమలు కలిపించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మహిళలకు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయకుండా, ప్రచారం కోరుకోవడం ముఖ్యమంత్రితో పాటు మంత్రులకు అలవాటుగా మారింది. మహాలక్ష్మి పథకానికి ఈ రాష్ట్రంలోని రేషన్ కార్డు కలిగి ఉన్న 93 లక్షల కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళను అర్హులుగా తీసుకున్నా.. 10 నెలలుగా నెలకు రూ. 2,500 చొప్పున 93 లక్షల మహిళలకు ఒక్కొక్కరికీ రూ. 25,000 వేలు బాకీ పడ్డారు. అంటే మొత్తం రూ. 23,250 కోట్లు. మహాలక్ష్మి అమలు చేయకుండా మోసం చేయడమే కాకుండా రూ. 3,325 కోట్ల లెక్క చెప్పి, చెల్లించాల్సిన రూ. 23,250 కోట్లు కప్పి పుచ్చారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇది కాకుండా కళ్యాణ లక్ష్మి చెక్కులకు అదనంగా తులం బంగారం ఇస్తామని మాట తప్పారు. రూ. 500 గ్యాస్ పథకం, 200 యూనిట్ల గృహజ్యోతిని కొందరికే పరిమితం చేశారు. హామీల అమలు విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అని విమర్శించారు. ఇక మహిళల గౌరవాన్ని నిలబెడుతున్నట్లు చెప్పిన మీ మాటలు అటుంచితే, ముందు మహిళల ప్రాణాలు కాపాడాలని, శాంతి భద్రతలు నిర్వహించి వారి

# జివో నెంబర్ 29ని రద్దు చేయాలి

### మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల పక్రియ

### పాత జివో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన

### పిసిసి చీఫ్, కెటిఆర్‌లతో విడివిడిగా అభ్యర్థల భేటీ



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గ్రూప-1 అభ్యర్థులు అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశంగా మారింది. గాంధీ భవన్ లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల డిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్ లో ఇచ్చిన 503 పోస్టులలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు.పెంచిన 60 పోస్ట్ ల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29 , రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్ ను కోరారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని అన్నారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్ పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖ లో ఉద్యోగాలు. గ్రూప్స్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్టాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రూప్ -1 అభ్యర్థులు సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు అభ్యర్థులు విన్నవించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను కేటీఆర్ విన్నారు. అయితే గ్రూప్-1 మెయిన్స్‌ను రీ షెడ్యూల్ చేయాలని గత కొద్ది రోజుల నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. కానీ కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువు అభ్యర్థులు మాట్లాడుతూ జీవో 29, జీవో 55పై ఎటూ తేల్చకుండా, తప్పుడు ప్రశ్నల అంశాన్ని పరిష్కరించకుండా ఆగమేఘాల మీద గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్‌లో అన్ని ప్రశ్నలూ తప్పులతడకలేని, 150 ప్రశ్నలకు 20 ప్రశ్నలు తప్పుగా వచ్చాయని గుర్తుచేశారు. ఈ కేసులన్నీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని కెటిఆర్ కు కూడా అభ్యర్థులు వివరించారు. దీనిపై కెటిఆర్ సానుకూలంగా స్పందిస్తూ, దీనిపై న్యాయ సలహా తీసుకుంటామని హామీ ఇచ్చారు.. అభ్యర్థులకు అన్నివిధాల అండగా ఉంటామని కెటిఆర్ హామీ ఇచ్చారు. కాగా, గ్రూప్ 1 మెయిన్స్ రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు గత కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం సాయంత్రం వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షపై దాదాపు 33 కేసులు వచ్చాయని.. వాటన్నింటినీ పరిష్కరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులంతా ఒక్కసారిగా దూసుకురావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు అభ్యర్థులను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. అయితే, ఈ వివాదం కొనసాగుతుండగానే ఈ నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ నిర్వహణకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 14న టీజీపీఎస్సీ హాల్ టికెట్లను విడుదల చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.



# పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

### అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతి కుమారి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ .. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు

# రాడార్ కేంద్రంపైనా రాజకీయమా

### దేశ రక్షణపై ఇంతటి దౌర్భాగ్యపు మాటలా

### కెటిఆర్ తీరుపై మండిపడ్డ సిఎం రేవంత్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాడార్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందే బీఆర్ఎస్ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వాళ్లు దిగిపోయే నాటికి అన్ని పర్మిషన్లు తీసుకున్నారని తెలిపారు. దేశ భద్రతను కూడా రాజకీయాలకు ముడిపెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. దేశ భద్రతను వ్యతిరేకిస్తే వాడు కసబ్ కంటే హీనుడు అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. లక్షల ఎకరాలు కాలుష్యం చేయాలని చూసిన వాళ్లు రాడార్ సెంటర్ గురించి మాట్లాడుతున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. దేశ ప్రయోజనాల కోసం పెట్టే ప్రాజెక్టును ఎలా అడ్డుకుంటామని ఆయన ప్రశ్నించారు. 12 లక్షల చెట్లు పోతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వందలు, వేలల్లోనే చెట్లు పోతున్నాయని సీఎం చెప్పారు. ఆ చెట్లకు ఐదింతలు మొక్కలు నాటుతారని తెలిపారు.వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రానికి కేంద్ర మంత్రి రాజ్?నాథ్?సింగ్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ను నేవీ ఇక్కడ నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికా దళం వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్?ను ఉపయోగిస్తుంది. నేవీ రాడార్?కు సంబంధించి దేశంలోనే ఇది రెండో స్టేషన్. తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొదటిది. 1990 నుంచి అది నావికా దళానికి సేవలందిస్తోంది. రెండో రాడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ ఇప్పటికే గుర్తించింది. 2010 నుంచి నావికా దళం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావరణ అనుమతులు, క్లియరెన్స్ లు వచ్చినప్పటికీ.. గత ప్రభుత్వం భూముల కేటాయించలేదు. ఈ ఏడాది జనవరిలో కమోడోర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డీఈవో రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్ దాస్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అనంతరం వికారాబాద్ డీఎఫ్ వో, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1,174 హెక్టార్ల అటవీ

# రేవంత్‌వి తేనె పూసిన మాటలు

### మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిందే.. మందకృష్ణ మాదిగ హెచ్చరిక

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు. 'ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్‌వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు అమలుచేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది' అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

### రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర కోస్తా, తమిళనాడులో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితలం ఆవర్తనం కొనసాగుతుందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 20 వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో 22 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత వాయువ దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గురువారం తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడేందుకు అవకాశాలున్నాయని చెప్పింది.

## ఎడిటోరియల్

**కులాల కుంపట్లు రగిలించడమే లక్ష్యంగా రాజకీయాలు నడుస్తున్నాయి. బిసి కులగణనే ఇందుకు నిదర్శనం.దేశంలో పౌరులంతా ఒక్కటే అన్న భావన రాకుండా రాజకీయ పార్టీలు చాలా తెలివిగా తమ చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ప్రజల్లో కులమతాలు, వర్గ విభేదాలు లేకుండా అంతా భారతీయులమే అన్న భావన లేకుండా చేస్తున్న వారిలో విపక్షాలు ముందు వరసలో నిలుచున్నాయి. అందుకే వారు తమ ఓటు బ్యాంక్ రాజకీయాలను ప్రయోగిస్తున్నారు. ప్రజలు ఎప్పటికీ ఒక్కటి కాకుండా చూసుకోవడం వాటి లక్ష్యంగా కని పిస్తోంది.**

ఉమ్మడి పౌరస్మృతి విషయంలో రాజకీయపార్టీలు అనుసరిస్తున్న తీరు దేశద్రోహ చర్యగానే భావించాలి. ఎందుకంటే ఏ దేశంలో అయినా ప్రజలందరికీ ఒకేరకమైన హక్కులు ఉంటాయి. ఒకే రకమైన చట్టాలు ఉంటాయి. కానీ ఏం దౌర్భాగ్యమో భారత్‌లో మాత్రమే ఇలా వేర్వేరుగా చట్టాలు ఉంటాయి. ఉండాలని కమ్యూనిస్ట, కాంగ్రెస్ పార్టీలు కోరుకుంటున్నాయి కూడా. చట్టాలు ఒకేరకంగా ఉండడానికి వీలులేదన్న కుత్సిత భావనలో రాజకీయపార్టీల నేతలు ఆలోచిస్తున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులంత గోడవాటం గాళ్లు ..దేశంలో మరొకరు ఉండరు. చైనా, రష్యా, క్యూబా గురించి మాట్లాడుతున్న ఎర్ర జెండా వాళ్లకు భారత్‌లో మాత్రం ప్రజలందరి రక్తం ఒక్కటే అన్న సోయి ఉండదు.ఎవరి రక్తం వారిదే అన్న వాదన లో ఉంటారు. ఉపన్యాసాలు ఇచ్చే సమయంలో

మాత్రం మనమంతా ఒక్కటే.. మనందరిలోని రక్తమంతా ఒక్కటే అంటారు. కులమతాల అడ్డుగోడలు తొలగాలనేది వారే.. కులమాతాలకు అనుగుణంగా చట్టాలు ఉండాల్సింది అని పట్టుబడేది వారే.ఇలా అయితే దేశం మరో వందేళ్లయినా అభివృద్ధి చెందదని గుర్తించాలి. కమ్యూనిస్టులు.. వారిని అనుసరిస్తున్న వారు తమ ఆలోచనా ధోరణి బూజుపట్టిందన విషయం తెలుసు కోవడం లేదు. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో వారు ఆడుతున్ననాటకాలు దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి తప్ప మరోటి కాదు. మతపరమైన ఆచారాలు, సంప్రదాయాలకు అతీతంగా దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టం వర్తించాలన్నది బిల్లు లక్ష్యం. నిజానికి మతాచారాలు ఎవరికి వారు నిర్వహించుకోవచ్చు. మర్డర్లు, రేపులు, దొంగతనాలు, పెళ్లిల్లు చేసుకునే సమయంలో చట్టం అందిరికీ ఒకేలా ఉండాలి. అంటే.. పెండ్లిళ్లు, విడాకులు, వారసత్వం, దత్తత, జీవన భృతి అంటే..భరణం, మనోవర్తి, ఇతరత్రా మొదలైన అన్ని అంశాల్లో కుల, మత, వర్గాలకు అతీతంగా పౌరులందరికీ ఒకే చట్టం ఉండాలన్న విశాల దృక్పథాన్ని విపక్షాలు అడ్డుకుంటున్నాయని గుర్తించాలి.

## కుల గణన కాదు..ప్రజలను ఏకం చేయాలి

### దేశమంతా ఒక్కటే అన్న భావన రావాలి

### ఉమ్మడి పౌరస్మృతితోనే అది సాధ్యం

నిజానికి దేశంలో ఇప్పటి వరకు మతపరమైన చట్టాలే ఉన్నాయి. హిందూ వివాహ, వారసత్వ చట్టాలు, షరియా లాంటి ముస్లిం పర్సనల్ చట్టాలు అమలవుతున్నాయి. వీటివల్ల ఎన్ని గందరగోళాలు వస్తున్నాయో చూస్తూనే ఉన్నాం. అందరిదీ ఒకే రక్తం అంటున్న వారు అందరికీ ఒకే రకమైన న్యాయం,చట్టం ఉండాలన్న సోయిని మరచి వ్యవహరిస్తున్నారు. మన దేశం ఒక లౌకిక రాజ్యంగా ఉండాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని, అన్ని భాషలను గుర్తించి గౌరవించాలని రాజ్యాంగంలో అనేక అంశాలను చేర్చారు. కానీ ఇన్నేళ్లయినా కుల మతాల కారణంగా ప్రజలందరూ భయం భయంగా బతికే వాతావరణం దేశంలో చూస్తున్నాం. కులమతాలు వారి ఆచార వ్యవహారాలు ఇంటికే పరిమితం కావాలి. చట్టం ముందు అంతా ఒక్కటే అన్న భావనరావాలి. అంటే ఉమ్మడి పౌరస్మృతి ద్వారానే ఇది సాధ్యం అవుతుంది. భారత దేశ సమగ్రతను, సమ భావాన్ని గౌరవించే వాళ్ళందరూ ఏకోన్ముఖంగా పౌరస్మృతిని కోరాల్సిందే. నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత భారత దేశాన్ని ఐక్యంగా ఉంచాలని చేస్తున్నప్రయత్నాలకు అడుగడున్నా అడ్డుకుంటున్నారు. రాజ్యాంగానికి ప్రమాదం వచ్చిందని గగ్గోలు పెడుతున్నారు. వీరి మాటలు పట్టించుకుని ఉంటే కాశ్మీర్‌లో 370 రద్దయ్యేది కాదు. ఎందుకంటే వారికి ఓట్లు తప్ప దేశం గురించి పట్టదు. దేశాన్ని ఎందుకు విడదీశారో..మతప్రాతిపదిక ఎందుకు ఆ పనిచేశారో చర్చ చేయరు. భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా అమలు కావాలంటే ఏకభావన రావాలి. సమాన హక్కులు ఉండాలి. ప్రజలంతా ఒక్కటే అన్న భావన పాదుకొల్పాలి. ఇంకా పేదలను పేదలుగా, మైనార్టీలను ఇంకోరకంగా చూసే సంస్కృతి పోవాలి. దానిని వదిలి కులగణన చేయాలన్న తీరు సరికాదాఉ. ప్రతి ఒక్కరూ మనమంతా ఒక్కటే అన్న భావన కోసం చేసే ఎలాంటి ప్రయత్నాన్ని అయినా స్వాగతించాల్సిందే. ప్రజా వ్యతిరేక చర్యలను రెచ్చగొడుతూ.. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మతాల పేర్లతో వైషమ్యాలను సృష్టిస్తూ భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని దూరం చేయాలి. అనేక భాషల ప్రజలు, అనేక మత విశ్వాసాలతో ఉన్నవారంతా కలసి మెలసి ఒకే రాజ్యంలో సహజీవనం చేసే సత్ సాంప్రదాయం భారత ప్రజల మధ్య ఉన్నది. అది ఇక నిరంతరంగా సాగాలి. జాతీయోద్యమంలో చీలిక తెచ్చేందుకు బ్రిటిష్ పాలకులు విభజించి పాలించు సూత్రంలో భాగంగా భారతీయ ప్రజల మధ్య హిందూ, ముస్లిం మతాల పేరుతో ప్రజల్ని విభజించే కార్యక్రమం చేసింది. రాజకీయ నాయకుల పుణ్యమా అని నేటికీ అదే కొనసాగు తోంది. అది పోవాలంటే ప్రజలంతా ఒక్కటే అన్న భావన రావాలి. ప్రజల్లో చట్టాల పట్ల గౌరవం ఉండాలి. నీకో చట్టం..నాకో చట్టం అన్న భావన ఉండరాదు. ప్రజల మధ్య ఐక్యత, దేశ సమగ్రత కాపాడుకోవడానికై అన్ని మతాలను సమభావనతో చూసేలా చట్టాలు ఉండాలి. మతాల ఆధారంగా చట్టాలు ఉండరాదు. ప్రజల ఆధారంగా చట్టాలు ఉండాలి. రాజకీయ పార్టీలు కళ్లు తెరవకుంటే నష్టపోయేది ప్రజలే.




# గుదిబండగా ఎన్నికల హామీలు !

ఎన్నికల్లో వాగ్దానాలు చేయడం ఎంత సులువో..వాటిని అమలు చేయడం అంత కష్టం అని సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. రైతురుణమాఫీపై ఎంతగా విమర్శలు వస్తున్నాయో చెప్పలేం. దానిని సమర్థంగా తిప్పి కొట్టలేక పోతున్నారు. ఇకపోతే దుబారా ఖర్చులు తగ్గించుకుని అభివృద్ధికి బాటలు వేయాలి. పేదల జోలికి వెళ్లకుండా చూసుకోవాలి. హైడ్రాను కేవలం ఉన్నతవర్గాల ఆక్రమణలకే పరిమితం చేయాలి. పేదలకు ప్రత్యామ్నాయం చూపి ముందుకు సాగాలి. అలాగే తొలుత అభివృద్ధి పనులకు పెద్దపీట వేయాలి. రుణాల జోలికి వెళ్లకుండా, ప్రజలపై భారం మోపకుండా, గుదిబండ గా ఉన్న పథకాలను ముందు పక్కన పెట్టే ప్రయత్నం చేయాలి. విద్యా, వైద్య రంగాల్లో చర్యలను ఆహ్వానించాల్సిందే. అయితే నేటికీ వైద్యరంగం వెక్కిరిస్తోంది. ప్రైవేట్ వైద్యానికే ప్రజలు మొగ్గ చూపుతున్నారు. అందువల్ల క్షేత్రస్థాయిలో దీనిని ప్రథమంగా సంస్కరించాలి. ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలి. ఆస్పత్రులను బలోపేతం చేయాలి. ఇలా చేయడం వల్ల ఆరోగ్య రంగం బలోపేతం అవుతుంది. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేలా చేయాలి.అప్పుడే ప్రభుత్వంపై భారం తగ్గగలదు. కానీ అలా చేసే దమ్ము కనిపించడం లేదు. అందులోనూ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు, వర్గాలు ఎప్పుడూ మేల్కొని ఉంటాయి. నాయకుడిని సులువుగా పనిచేయ కుండా చేస్తారు. అలా కాకుండా నాయకత్వ లక్షణాలతో కాంగ్రెస్‌లో పులిలా నిలబడ్డది ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక్కరే. ఎంతో బలమైన నేతగా ఉన్న చెన్నారెడ్డిని సైతం అప్పట్లో ముప్పుతిప్పలు పెట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డికి కూడా అలాంటి ముప్పే పొంచి ఉంది. ఆయన చుట్టూ ముళ్ల కంచెలే ఉన్నాయి. ఓ వైపు కేబినేట్‌లో ప్రతి ఒక్కరూ తమకుతాము సిఎంగా ఊహించుకుంటూ పోతున్నారు. అందుకే బలమైన నిర్ణయాలతోనే ప్రజల్లో నేతగా నిలబడే ప్రయత్నం చేయాలి. ధరణి,రేషన్ కార్డులు, ఇళ్లు వంటివన్నీ త్వరగా పూర్తి చేసే ప్రయత్నం చేయాలి.వాటిని అమలు చేసేందుకే సత్తా కావాలి. అందునా తెలంగాణలో ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దారుణం గా ఉంది. గత ప్రభుత్వం 14లక్షల కోట్లు అప్పుల్లో ఉంచిందని ప్రభుత్వమే ఆరోపిస్తోంది. ఈ క్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సిఎం రేవంత్ రెడ్డికి ఎన్నికల హామీలను అమలు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే ఖజానా నిండుకుని ఉంటే ఇది పెద్ద సమస్య అయ్యేది కాదు. కొన్ని గ్యారెంటీ లను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందున్నది ముసళ్ల పండగే అని చెప్పుకోవాలి. ముళ్లకంచెల ను దాటాలి. ప్రధానంగా రైతులకు 2లక్షల రుణమాఫీ, రైతుబంధు పంపిణీని పూర్తి చేయాల్సిన కార్యక్రమాల్లో విమర్శలు రాకుండా చూడాలి.. ఈ హామీలను ప్రభుత్వంలోకి రాగానే నెరవేరుస్తామని మాట ఇచ్చారు. ఈ క్రమంలో రైతుబంధు ఎప్పుడు జమ చేస్తారో చెప్పాలని అప్పులు చేసిన నేతలు విమర్శిస్తున్నారు. పదేళ్ల దరిద్రపు వారసత్వాన్ని అందించిన బిఆర్ఎస్ ఇప్పుడు తమ హయాంలో ఉన్న సమస్యలపైనే నిలదీయడం సిగ్గుచేటు. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, ఆస్పత్రులల్లో సమస్యలు ఈనాటివి కాదు. ఇవన్నీ మరని బిఆర్ఎస్ నేతలు అప్పుడే డిమాండ్లు మొదలు పెట్టారు. ప్రధానంగా రైతుబంధుతో పాటు ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు ఎప్పట్నుంచి ఇస్తారో అసలుసిసలు రైతులకు స్పష్టత ఇవ్వాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుబంధును ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పారు. చిన్న,సన్నకారు రైతుల వివరాలను సేకరించి వారికే పట్టం కట్టాలి. అలాగే ఇలాంటి ఉదార పథకాలకు పాతర వేయాలి. రూపాయి కిలో బియ్యం పక్కన పెట్టాలి. హైడ్రా కారణంగా వస్తున్న విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. ఇదంతా ఒక ఎత్తయితే..

కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్థిక స్థితిని చక్కదిద్దుకుంటూనే.. పార్టీని సమన్వయం చేసుకుంటూ సాగాల్సిన అవసరం సిఎం రేవంత్ ముందుంది. ఎన్నికలకు ముందునుంచే అనేక సందర్భాల్లో ప్రభుత్వం వస్తే ఎలా చేస్తామో..ఎలా ముందుకు వెళతామో అన్న స్పష్టమైన విధానాలను రేవంత్ రెడ్డి ప్రకటించారు. బహుశా ఆయన మదిలో ఇవన్నీ అమలు చేయడమెలా అన్న ప్రణాళిక ఉండివుంటుంది. ప్రభుత్వపరంగా ఇవన్నీ చేయడం ఒక ఎత్తయితే పార్టీలో అందరినీ కూడగట్టుకుని పోవాల్సి ఉంటుంది. పదవుల మీద ఆశతో చాలామంది ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కొద్దిపాటి మెజారిటీ మాత్రమే లభించడంతో పాటు, పార్టీ కోసం శ్రమించిన వారు అనేకులు బయట ఉన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లడం కత్తిమీద సాములాంటిది. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డికి పూర్తి అండగా ఉన్నప్పటికీ శాసనసభ్యులను విశ్వాసంలోకి తీసుకుని కదలాల్సి ఉంటుంది. సుస్థిర, సమర్థ ప్రభుత్వాన్ని అందించడం ద్వారా ముందుకు సాగడం ప్రస్తుతం రేవంత్ రెడ్డికి కత్తి మీద సాము లాంటిదే. సొంత పార్టీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం ఒక ఎత్తయితే..విపక్ష బీఆర్ఎస్ విసిరే సవాళ్లను కూడా పసిగట్టి ముందుకు సాగాల్సిన ఉంటుంది. గెలిచినా అధికారం కోల్పోయామన్న విపక్షంలో ఉన్న ఎమ్మెల్యేల బాధ మరో వైపు ఉన్న ప్రస్తుత తరుణంలో ఇప్పుడంతా ఎవరు ఎటువైపు దూకుతారన్న చర్చ తెలంగాణలో ప్రధాన అంశంగా ఉంది. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన పలువురు బిఆర్ఎస్‌లో చేరారు. వారంతా ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యేలుగా గెలిచి విపక్షంలో ఉన్నారు. ఎందుకంటే పార్టీ మారడం ఎంత సులువో గతంలో బిఆర్ఎస్ దారిచూపింది. అందుకే కాంగ్రెస్ ముందు జాగ్రత్తగా కొందరు ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రయత్నాలు చేసింది. అయితే మిగతా వారు అంతా కట్టగట్టుకుని వస్తారని భావించారు. కానీ అలాంటి అవకాశం లేకుండా బిఆర్ఎస్ జాగ్రత్తలు తీసుకుంది. ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసింది. కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానం మాటే శిరోధార్యం. అటు వారిని మెప్పించాలి. అధిష్టానానికి అందే ఫిర్యాదులకు సమాధానం ఇవ్వాలి. అలాగే ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఇవన్నీ కనిపెట్టుకుని రేవంత్ రెడ్డి ముందుకు సాగాలి. అప్పుడే సమర్థుడైన నేతగా సాగుతారు. ప్రజాదర్బార్ నిర్వహించడం, విద్యుత్ శాఖ పనితీరును సమీక్షించడం, చకచకా నిర్ణయాలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డికి తన పదవిని సుస్థిరం చేసుకోవడంతో పాటు హామీలు అమలు చేయడం ద్వారా ఎదురులేని నేతగా ఎదగడానికి కృషి చేయాలి. తక్కువ సమయంలో ఇచ్చిన హామీలను చకచకా అమలు చేయగలగాలి. తానేమిటో నిరూపిం చుకుని ప్రజలతో మంచి అనిపించుకోవాలి. కేసీఆర్‌ను మించిన నేతగా పేరు తెచ్చుకుంటేనే రాజకీయంగా రేవంత్ నిలదొక్కు కోగలడు. అందుకే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూనే.. తాను మరింత బలపడాల్సిన పరిస్థితి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంది.

(ఆధ్యాత్మిక చింతన)



## తిరుమలలో పున్నమి గరుడ సేవ

తిరుమలలో ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం అక్టోబర్17న పౌర్ణమి సందర్భంగా నెలవారీ గరుడసేవ జరగనుంది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుడ వాహనంపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇక, దసరా పండగ సెలవులు ముగిసినప్పటికీ తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనానికి కంపార్టుమెంట్లనీ నిండి వెలుపల క్యూలైన్లలో భక్తులు వేచిఉన్నారు. దీంతో టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు శ్రీవారి దర్శనానికి 6 గంటల సమయం పడుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తున్నది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు 5 గంటల సమయం పడుతుంది.ఇక సోమవారం అర్ధరాత్రి వరకు 75,361 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,850 మంది భక్తులు తలనీలాలు సర్పించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్ల ఆదాయం సమకూరినట్టుగా టీటీడీ వెల్లడించింది. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులు తరలివస్తుంటారు. నిత్యం వేలాది మంది భక్తులు తిరుమల చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. శ్రీవారిని దర్శించుకుంటే సకల పాపాలు హరించిపోతాయని భక్తుల నమ్మకం.

కెసిఆర్ తీరు ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రతిపక్ష నేతగా ఉన్నా ప్రజల్లోకి రావడం లేదు. అంతా కొడుకు, అల్లుడు చూసుకుంటున్నారు. అధికారం కోల్పోవడంతో ఇక ప్రజలతో తనకేమి పని అన్న ధోరణిలో ఉన్నట్లుగా ఉన్నారు. బిఆర్ఎస్ కూడా విమర్శలే లక్ష్యంగా పని చేస్తోంది. తమ హయాంలో భ్రష్టు పట్టించిన అంశాలకు సమాధానాలు చెప్పడం లేదు. వారసత్వంగా అందించిన సమస్యలపైనా చర్చించడం లేదు. ప్రతిరోజూ కెటిఆర్, హరీష్ రావులు అనేక సమస్యలు ప్రస్తావిస్తూ దాడి చేస్తున్నారు. ఇవన్నీ పదేళ్లుగా తమ హయాలంలో ఉన్నవే అని గుర్తించ లేక కాదు. తప్పులను రేవంత్ ఖాతాలో వేయాలన్న దుర్బుద్ధి తప్ప మరోటి కాదు.

## విపక్షనేతగా కెసిఆర్ వైఫల్యం

### కనీస మర్యాద పాటించడంలో విఫలం

### అధికారం లేకపోతే బయటకు రాని వైనం



అదే సమయంలో ఎర్రవెల్లి ఫామ్ హౌజ్‌లో కెసిఆర్ విశ్రాంతి కొనసాగిస్తున్నారు. తొలినాళ్లలో ప్రగతి భవన్‌లో ఒక్కనాడు కూడా సామాన్యుల కు ప్రవేశం లేకుండా చేశారు. అలాంటి కేసిఆర్‌కు ప్రజల మీద హఠాత్తుగా ప్రేమ పుట్టుకు వచ్చింది. అధికారం పోయిన వెంటనే ఎర్రవెల్లికి బస్సులు వేసుకుని సామాన్యులు తమకుతాముగా పరుగెత్తుకుంటూ వచ్చారు. వారిని సాదరంగా ఆహ్వానించి భోజనాలు పెట్టించారు. ఓటమి చెందినా హుందాగా స్వీకరించలేక పోయారు. పదేండ్ల పాటు తనకు అధికారం చేయడానికి అవకాశం ఇచ్చిన ప్రజలకు కనీసం ధన్యవాదాలు తెలియజేయలేదు. ప్రజాతీర్పును స్వీకరిస్తున్నానని ప్రకటించలేదు. విజయం సాధించిన కాంగ్రెస్‌కు నోటిమాటగా నైనా శుభాకాంక్షలు తెలియజేయలేదు. సాధారణంగా కొత్త ముఖ్యమంత్రి ఎవరైనా దిగిపోతున్న సిఎం శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతారు. ఆ కనీస మర్యాదను కూడా కెసిఆర్ పాటించలేదు. పది నెలలు గడిచినా కెసిఆర్ తను నిర్మించుకున్న సౌధం నుంచి ప్రజల్లోకి రావడం లేదు. ప్రజల సమస్యలను చర్చించడం లేదు. ఫామ్‌హౌస్‌కు బలవంతంగా తీసుకుని వచ్చిన వారిని మాత్రం కేసీఆర్ కలుసుకున్నారు. ఏదేమైనా కేసీఆర్ వ్యవహరించిన తీరు మాత్రం తెలంగాణ ప్రజలను కూడా అవమానించడమే. ప్రజల తీర్పు పట్ల ఆయన అసంతృప్తిగా ఉన్నా...అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకోసం పోరాడే నేతగా నిరూపించుకోవాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు. విపక్ష నేతగా తన బాధ్యతను నిర్వహించాలి. మంచి సలహాలు ఇచ్చి తెలంగాణ అభివృద్ధిలో భాగం కావాలి.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి

## బిఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ అధ్యక్షుడు కుంభగాళ్ల ధనరాజ్ అన్నారు





గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : మణికొండలో ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవతో చేయడం జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ అధ్యక్షుడు కుంభగాళ్ల ధనరాజ్ అన్నారు. బీఆర్ఎస్ తరపున ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు గత కొద్ది రోజులుగా ఇంటింటికి బస్తీ బస్తీకి వెళ్లి ప్రజల సమస్యలను ప్రజాభిప్రాయ సేకరణలో తెలుసుకున్నారు. అందులో భాగంగా డాలర్ హిల్స్ కాలనీ, ఖిల్లా కాలనీ వద్ద నిర్మించిన నీటిని పంపు చేసే బూస్టర్ వినియోగంలో ట్రాన్స్ ఫార్మర్ లేదని కొద్దికాలం, సాంకేతిక కారణాల వల్ల మరి కొద్ది కాలంగా నిరుపయోగంగా ఉన్న వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు 18 వ డివిజన్ జనరల్ మేనేజర్ ను, డిప్యూటీ జనరల్ మేనేజర్ ను, మేనేజర్ లను కలిసి అభినందించి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్ రావు, ఉపేంద్రానాథ్ రెడ్డి, యాళల కిరణ్, కందాడ ప్రవీణ్, ఎర్రోళ్ల రమేష్, ఎం.కృపాకర్, సయ్యద్ ఆరీఫ్, సయ్యద్ అష్ఫక్ అలీ, సయ్యద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడు లక్ష్మయ్యకు నివాళులర్పించిన స్థానిక నాయకులు

## కుటుంబానికి ఆర్థిక సాయం



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలం పరిధిలోని తుంగపాడు గ్రామానికి చెందిన బైరమోని లక్ష్మయ్య బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ నేతళ్ళ కొండల్ యాదవ్ లక్ష్మయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 10,000 రుపాయాల ఆర్థిక సాయం అందించారు. వీరితో పాటు మాజీ సర్పంచ్ దండిగ అలివేలు నర్సింహా యాదవ్, మాజీ ఎం పి టి సి కొమ్ము వెంకటయ్య, దండిగ కృష్ణయ్య, మాజీ చైర్మన్ పుల్కరం యాదయ్య, పాపయ్య, చరణ్, నేతళ్ళ లింగయ్య, శంకర్, కసి రెడ్డి రఘు, నరేష్, నీల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు





# అయ్యప్ప స్వామి ఆశీస్సులతో మహా పాదయాత్రను విజయవంతం పూర్తి చేయాలి

## కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** అయ్యప్ప స్వామి ఆశీస్సులతో అయ్యప్ప స్వామి మాలధారుల మహాపాదయాత్రను విజయవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. కొత్తూరులో అయ్యప్ప గురుస్వామి ముత్యం రెడ్డి ఆధ్వర్యం లో 100 మంది స్వాములతో అయ్యప్ప స్వామి మహా పాదయాత్ర కార్యక్రమం నిర్విరామంగా సాగాలని వేడుకుంటూ వారికి మెడికల్ కిట్ లను కార్పొరేటర్ పద్మావతి పాపయ్య అందజేశారు.

# కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే..



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ గురువారం ఎమ్మెల్యే వివేకానంద ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ , గాజులరామారం సర్కిల్ లో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రేపన్ గిరిబాబు, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం కేపీ వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు చైర్మన్ ముత్యాలు, సలహాదారులు గణేష్,వేముల నరేష్, విజయసాగర్ రెడ్డి, అధ్యక్షులు రేపల్లె గిరిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు సాయి బాబా, ఉపాధ్యక్షులు నరేష్ కుమార్, నరసింహ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్,జాయింట్ సెక్రటరీ మల్లేష్, కోశాధికారి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ మహర్షి వాల్మీకి జయంతి

గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు మహర్షి వాల్మీకి జయంతిని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ మద్దెల లతాప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి అందరినీ ఆదర్శనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ బి.శరత్ చంద్ర, మేనేజర్ మంజులత, జేఏఓ స్వాతి రెడ్డి, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్, ఆర్ఐ శివ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# శ్రీ నాగ లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. 50 వేల విరాళాన్ని అందించిన జిల్లా గణేష్...



**కూకట్ పల్లి, అక్టోబర్ 17 (క్రైమ్ మిర్రర్):** శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి స్థల సేకరణలో భాగంగా రూ.50 వేల విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ జన్మదిన్నాన్ని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కోసం 50 వేల రూపాయలు విరాళంగా ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఇంకా ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్టు జిల్లా గణేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు పి మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారిని ఆదుకునే తత్వం ఉండాలి । కౌన్సిలర్ రవినాయక్

## సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని అందచేసిన కౌన్సిలర్ రవినాయక్



**మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్):** తుక్కుగూడ మున్సిపాలిటీ బాసగూడ తండా కు చెందిన నరేష్ కు 30000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుని అందజేసిన కౌన్సిలర్ రవి నాయక్, నరేష్ కుటుంబ సభ్యులైన సరోజ బాయ్ కి గత ఐదు నెలల ముందు ఆరోగ్య సమస్యలు రావడంతొ హాస్పిటల్లొ చికిత్స చేయించుకున్నారు హాస్పిటల్లొ చికిత్సకైన ఖర్చుల బిల్స్ తీసుకొని కౌన్సిలర్ రవి నాయక్ కు సంప్రదించడంతో రవి నాయక్ మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగ వచ్చిన 30వేల రూపాయల చెక్కుని వారి కుటుంబ సభ్యులకు అందచేశారు.ఈ సందర్భంగా నరేష్ నాయక్ మాట్లాడుతూ స్థానిక కౌన్సిలర్ రవి నాయక్ తను కౌన్సిలర్ కాక ముందు నుండే గత 15 సంవత్సరాల నుండి ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినాఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకెళ్తే చాలు తన వంతు సాయం గాని ప్రభుత్వం నుండి వచ్చేసహాయం గాని అన్నిటికీ ముందుండి సహాయపడుతుంటారని అని నరేష్ నాయక్ హర్షం వ్యక్తం చేసారు.



# కేతపల్లి లో నూతన ఉపాధ్యాయుగా బాధ్యతలు స్వీ కరించిన వేలాద్రికి సన్మానం

## స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నల్గొండ జిల్లా అధ్యక్షుడు: ఆకుల పల్లి నరేష్

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల వెలువడిన డీ ఎస్ సి ఫలితాలలో ఎస్ జి టిగా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి కేతపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు గా బాధ్యతలు స్వీకరించిన నాంపల్లి మండలానికి చెందిన గాదేపాక వేలాద్రి ని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల పల్లి నరేష్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు డి.ఎస్.పి మండల అధ్యక్షుడు ఇరిగి సుధాకర్, పి పి హెచ్ ఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల పల్లి శ్రీను, చిరంజీవి, ఎల్లయ్య, రజినీకాంత్, నవీన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేఎంసీ 13 వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

## కార్పొరేటర్ రావులకోళ్ల మాలతీ నాగరాజు





**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో 13 వ వార్డులో రోడ్లను అభివృద్ధి చేసేందుకు చొరవతో పని చేయడం జరుగుతుందని కార్పొరేటర్ రావులకోళ్ల మాలతీ నాగరాజు అన్నారు. గురువారం 13 వ వార్డులో సంగం సిటీ కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వార్డులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# హమాలి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** ప్రభుత్వాలు మూటలు మోసే కార్మికులకు ప్రమాదాలు జరిగితే ఆదుకోవడానికి హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. గురువారం నాడు కిస్మత్ పూర్ లోని సివిల్ సప్లై గోదాం హమాలి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. హమాలీల బ్రతుకులు మారాలంటే ఏఐటీయూసీ జెండా పట్టుకుని సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాలు మూటలు మోసే కార్మికులకు ప్రమాదాలు జరిగితే ఆదుకోవడానికి హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఆదుకునే పెన్షన్ సౌకర్యం లేకపోవడం వయసులో ఉన్నంతకాలం పనిచేసే రిటైర్మెంట్ అయిన తర్వాత వీరి బతుకులు అగమ్యగోచరంగా మారే పరిస్థితిలో ఉన్నందున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హమాలి కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



# ప్రపంచంలోనే వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయులు

## శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

## వాల్మీకి తోనే శ్రీరాముడు ఆ స్థాయికి ఎదిగారు

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు...పాల్గొన్న కాంగ్రెస్ నేతలు...

**కూకట్ పల్లి, అక్టోబర్ 17 (క్రైమ్ మిర్రర్):** శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ, వాల్మీకి సోదరులకు వాల్మీకి మహర్షి జయంతి తెలుపుతూ ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణం రచించారని, మనం ఏదో సందర్భంలో రామాయణం గురించి ఆ సీతారాముల గురించి ప్రపంచానికి తెలియజేశారు. అలాంటి మహర్షి జయంతి ఒక పండగ వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో దేవుని అనుగ్రహం ఉన్నప్పుడే మనం ఏ పని చేసినా ఆ పనిలో విజయం కలుగుతుంది తెలిపారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో ప్రతి గ్రామాలలో పండగ



వాతావరణం నెలకొందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వాల్మీకి మహర్షి ఆశీస్సులతో ఉండాలని శేరి సతీష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, తమ్మినేని ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, పొడుగు అప్పారావు, వాల్మీకి అసోసియేషన్ సభ్యులు, నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.



# విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు...

## పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ...

**కూకట్ పల్లి, అక్టోబర్ 17 (క్రైమ్ మిర్రర్):** ప్రతి ఒక్కరూ విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ వాసి కురిపి కుమారుడు సుజిత్ మోహన్ కు భారత్ విభూషణ్ అవార్డు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, డాక్టరేట్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ మొదలగు అవార్డులు రావడంతో తెలంగాణ పిఎసి చైర్మన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకెపూడి గాంధీ పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి సుజిత్ మోహన్ ను, వారి తండ్రిని అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇదే స్పూర్తిని ఇంకా ముమ్ముందు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమములో సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, ఎల్లం నాయుడు, సతీష్ గుప్త శ్రీకాంత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా బాధితుల తరపున పోరాడుతాం

## మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి





**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో హైడ్రా బాధితుల తరపున పోరాడుతామని మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ లోని భరత్ కాలనీ, టీకేఆర్ కాలనీలు హైడ్రా మూసి ప్రాంతాలలో ఉన్నాయని, కాలనీలో ఉన్న ఇండ్లకు మార్కింగ్ వేయడంతో విషయం తెలుసుకున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి బాధితులను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హద్దు బందు 5 ఏళ్ల క్రితం పెట్టారని అది తెలుసుకునే ప్రజలు ఇక్కడ ఇల్లు కట్టుకున్నారన్నారు. కొత్తగా వచ్చి మార్కింగ్ వేయడం దుర్మార్గపు చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ఎంత దూరమైనా వెళ్తామని వీలైనంత త్వరలో కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కూలగొట్టే ఉద్దేశం ఉన్నట్లయితే ప్రజల ఆస్తి నష్టానికి మూడు రెట్లు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే ఇక్కడికి రావాలని ఆయన వివరించారు. నాయ్యం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ధర్నాలు చేయడానికి సిద్ధమవుతామని, ప్రజలు అధైర్యపడొద్దని బీజేపీ పార్టీ అండగా ఉంటుందని స్థానికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, వై శ్రీధర్, కొమరయ్య, గౌరీ శంకర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అమర్, స్టార్ చిన్న ముదిరాజ్, స్థానికులు, కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసింది...

## తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి మీద రెండు లక్షల అప్పుకి కారణం కెసిఆర్ పాలన కాదా...?

## సూటిగా ప్రశ్నించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం....

**కూకట్ పల్లి, అక్టోబర్ 17 (క్రైమ్ మిర్రర్):** రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో యెనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తొమ్మిది నెలల్లోనే ఎనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని ఈ రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందన్నారు. పదేళ్ల ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసిందని, పదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినపుడు మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల పై చిలుకు అప్పులు చేసి ఈరోజు ప్రతి వ్యక్తి మీద 2లక్షల అప్పుకు కారణం మీరు కాదా అని ప్రశ్నించారు. మా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అరవై తొమ్మిది వేల కోట్లు అప్పు అయితే దాంట్లో యాభై వేల కోట్లు దాదాపుగా మీ గత ప్రభుత్వ అప్పుల వడ్డీలు కట్టేందుకే సరిపోయిందని, అందులో ఇరవై వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామని, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసేది మీ కళ్ళకు కనపడుతుంటే అసలు ఆ మాటలు అనడానికి మీకు నోరెలా వచ్చిందని అన్నారు. హైదరాబాద్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా నటిస్తూ అనేక అక్రమాలకు తెరలేపింది, అక్రమ జీవోలతో బిల్డర్స్ కి ఎక్కువ ఎస్ఎఫ్టి కి ఇచ్చి




అక్రమాలకు పాల్పడింది, మూసి ప్రక్షాళన మొదలు పెట్టింది మీరు కాదా కేటీఆర్ అని ప్రశ్నించారు. అప్పుకు కాదు ఏది అనర్హం అన్నట్లుగా ప్రతి దాని మీద అప్పుల కుప్పగా ఈ రాష్ట్రాన్ని తాయారుచేసారు. మీరు చేసిన పాపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడిగే ప్రయత్నం చేస్తుంటే ప్రశ్నించే నైతిక హక్కు మీకు ఎక్కడిదని ప్రశ్నించారు.

# చిన్న అనంతగిరి శివాలయంలో ఆధ్యాత్మిక శోభ





**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** హైదరాబాద్ చిన్న అనంతగిరి శివాలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కుల వర్ణ ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా ఇంటిదగ్గర సరళమైన రీతిలో యజ్ఞం చేసుకునే విధానాన్ని తెలియజేస్తూ రూపొందించిన ఇంద్ర యజ్ఞం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అరుణాచలం పుణ్యక్షేత్రంలో భగవాన్ రమణ మహర్షి, కావ్య కంఠ గణపతి ముని ఆశీస్సులతో.. వేదములలో వివరించిన మంత్రముల ఆధారంగా ఈ పుస్తకం రూపొందించడమైనది. ఈ పుస్తకంలో సరళంగా యజ్ఞం చేసుకునే విధానాలను, మంత్ర భావములతో సహా శ్రీ గణపతి ముని ప్రసాదించిన ఇంద్ర యజ్ఞంను వివరించినట్లు గ్రంథకర్త సూర్య ఫణిమాధవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు, చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా రాష్ట్రీయ సేవికా సమితి నుంచి గౌడ రమాదేవి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నుంచి రమా విశ్వనాథన్ విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ గాయత్రీ తపోవనం ఆశ్రమ శిష్యులు అందరూ కలిసి మూలకర్తలుగా నిలిచి నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలందరితో కుల ప్రాంత వర్ణ, లింగ విచక్షణ లేకుండా సామూహికంగా ఇంద్ర యజ్ఞం చేయించారు. ఇదే మాదిరిగా సరళమైన రీతిలో ప్రతి ఇంట్లోనూ ఇంద్ర యజ్ఞం జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీ లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : తెలంగాణ పోలీస్ అకాడమీ లో మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఘనంగా జరిపారు. అకాడెమీలోని ఏకశిలా బ్లాక్ లో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలదండలతో అలంకరించి ఘనంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పురాణ భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని రచించిన ఘనత పొందిన వాల్మీకి మహర్షి రామాయణం ద్వారా కుటుంబం వ్యవస్థ, భార్య భర్తల అనుబంధం గురించి ప్రపంచానికి గొప్ప సందేశం ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా డిఎస్పిఎస్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. వాల్మీకి వేటగాడినుండి మహర్షి గా మారిన విధానం, మహర్షి రచించిన ఆది కావ్యమైన రామాయణాన్ని భారత్ దేశానికి అందించిన విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సునీత మోహన్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేణుగోపాల్ రెడ్డి, వెంకట రావు, రమణ, భూపాల్, శ్రీదేవి, డిఎస్పిలు కృష్ణ ప్రసాద్, ఆదూరి శ్రీనివాస రావు, జగదీశ్వరావు, కృష్ణ, తిరుపతి, బాలయ్య, గోపు శ్రీను, ఏఓ వెంకట శేఖర్, అకాడమీలోని రిజర్వు ఇన్స్పెక్టర్లు, మరియు అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.



# షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

## నవంబర్ 18లోగా హాజరు పర్చాలని కోర్టు ఆదేశం



**ఢాకా,(క్రైమ్ మిర్రర్):** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రిబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రిబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణహోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది.

## వాహనాలతో తిరుమలలో పర్యావరణ సమస్యలు

### ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పై టిటిడి దృష్టి

**తిరుమల,(క్రైమ్ మిర్రర్):** తిరుమలలో పర్యావరణ సమస్యలతో పాటు వాహనాల రాకపోకలు నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా తిరుమల ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (టిఐటిఎంఎస్) తక్షణమే అవసరమని టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. గురువారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సీవీఎస్‌వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ట్రాఫిక్ (÷ుసజౌతిఇ) నిర్వహణపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నిర్వహణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను తయారు చేయాలని పేర్కొన్నారు. టీటీడీ కాప్స్, తిరుమల పోలీస్, ఆర్టీఏ, టౌన్ ఎ÷-లానింగ్, ఏపీఎస్‌ఆర్టీసీ, ఇంజినీరింగ్, రెవెన్యూ, జీఎం ట్రాన్స్‌పోర్ట్ సభ్యులుగా ఉన్న కో-ఆర్డినేషన్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలను అంచనా వేసి వారంలోగా సిఫార్సులు అందజేయాలని కోరారు. తిరుమలలో ట్రాఫిక్ రద్దీ పాయింట్లయిన గోకులం, ఏటీసీ, రాంభగీచా, తదితర ప్రాంతాలను గుర్తించాలని, దర్శనం వచ్చే భక్తుల కోసం నిర్దిష్ట మార్గాలు , పార్కింగ్ స్థలాలను కేటాయించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని నివారించడానికి అదనపు బలగాల కేటాయింపు, అన్ని భవిష్యత్ నిర్మాణాలలో, మల్టీ-లెవల్ పార్కింగ్ సౌకర్యాలు తప్పనిసరి చేయాలని అన్నారు. డిజిటల్‌తో ట్రాఫిక్, పార్కింగ్ అప్‌డేట్‌ల కోసం ప్రత్యేకమైన మొబైల్ యాప్‌ను తయారు చేయాలని వెల్లడించారు.

## ర్యాష్ డ్రైవింగ్ వద్దన్నందుకు దాడి

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** సికింద్రాబాద్ పరిధిలో అల్వాల్‌లో దారుణం చోటు చేసుకుంది. బైక్‌పై ర్యాష్‌గా వెళ్లొద్దని చెప్పినందుకు ఆంజనేయులు అనే వృద్ధుడిపై ఓ యువకుడు దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన వృద్ధుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. 10 రోజుల క్రితం దాడి ఘటన జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. రూ.లక్షలు ఖర్చుపెట్టినా ప్రాణం దక్కలేదని మృతుడి కుమారుడు వాపోయాడు. తన తండ్రి మృతికి కారణమైన యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** మన్యం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందాడు. ఎల్విన్‌పేట పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ బుల్లిబాబు గురువారం కురుపాం మండలం జగడ-నీలకంఠంపురం ఘాట్‌రోడ్డు నుంచి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పింది. దీంతో ఏఆర్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కానిస్టేబుల్ మరణం పట్ల జిల్లా పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

## తమిళనాడు సుస్థిరాభివృద్ధికి ఎంజిఆర్ పునాది

### అన్నాడిఎంకె ఆవిర్భావం సందర్భంగా పవన్ ట్వీట్

అమరావతి,అక్టోబర్17(ఆర్‌ఎన్‌ఎ): తమిళనాడు సుస్థిరాభివృద్ధికి ఎంజీ రామచంద్రన్(ఎంజీఆర్) గొప్ప పునాది వేశారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ట్విట్టర్ వేదిక ద్వారా జనసేన తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఆర్ పార్టీని స్థాపించి పేదలు, అన్నార్థులకు సాయం చేశారని, ఆయన పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రశంసించారు. ప్రజల అవసరాలను గుర్తించడంతో పాటు భావితరాల బాగు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు.

## ఎపి సిఎస్‌కు నలుగురు ఐఎఎస్‌ల రిపోర్ట్

### డీవోపీటీ ఆదేశాల మేరకు నిర్ణయం

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు గురువారం ఏపీలో రిపోర్టు చేశారు. తెలంగాణ హైకోర్టు డీవోపీటీ ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్ , వాకాటి కరుణ ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ను కలిసి రిపోర్టు చేశారు. మరోవైపు ఏపీ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్‌లు బుధవారమే హదరాబాద్‌కు వచ్చి సీఎస్ శాంతికుమారికి రిపోర్టు చేశారు. కేంద్రం ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆలిండియా సర్వీసు అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందేనంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ ఉత్తర్వులు ఆపాలని కోరుతూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు హైకోర్టుకు వెళ్లారు. క్యాట్ ఇచ్చిన ఉత్వర్వుల్లో జోక్యం చేసుకోబోమని హైకోర్టు తేల్చిచెప్పడంతో ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్, వాకాటి కరుణ ఏపీకి వెళ్లి సీఎస్‌కు రిపోర్టు చేశారు.

## విమానాలకు వరుస బాంబు బెదిరింపులు

### ఎయిరిండియా విమానానికి మళ్లీ బెదిరింపు

### పరిస్థితిని సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**ముంబై,(క్రైమ్ మిర్రర్):** వరస బాంబు బెదిరింపుల ఘటనలు భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వరసగా నాలుగో రోజు కూడా బాంబు బెదిరింపు వచ్చాయి. ముంబై నుంచి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ల్యాండింగ్‌కి కొన్ని గంటల ముందు ఎమర్జెన్సీ సిగ్నల్స్‌ని పంపించినట్లు ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్ రాడార్ 24 గురువారం తెలిపింది. విమానం 'స్క్వాకింగ్ 7700' కోడ్‌ని పంపించింది. ఇది సాధారణ అత్యవసర పరిస్థితిని తెలియజేస్తుంది. ముంబై నుంచి ఎయిర్ ఇండియా విబమానం గురువారం ఉదయం 7.05 గంటలకు టేకాఫ్ అయింది. తూర్పు ఇంగ్లండ్ మీద ప్రయాణించే సమయంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. విమానం షెడ్యూల్ ప్రకారం లండన్ హీత్రూ విమానాశ్రయంలో మధ్యాహ్నం 12.05 గంటలకు దిగాల్సి ఉంది. 'స్క్వాకింగ్ 7700' విమాన పరిస్థితిని సమీపంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కి తెలియజేస్తుంది. నాలుగు రోజుల్లో కనీసం 20 విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ రోజు 5 ఎయిర్ ఇండియా, రెండు విస్తారా, రెండు ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బాంబు బెదిరింపుల అంశంపై నిన్న పార్లమెంటరరీ స్టాండింగ్ కమిటీ సమావేశమైంది.

## మరో రైతుల ప్రమాదం

### అసోంలో పట్టాలు తప్పిన లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్

### ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

### ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశాలు

**గౌహతి,(క్రైమ్ మిర్రర్):** వరుస రైలు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అస్సాంలోని దిమా హసావో జిల్లాలో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. అగర్తలా నుంచి ముంబయికి బయల్దేరిన ఈ రైలు ఇంజిన్‌తో పాటు ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. అస్సాంలోని దిబలోంగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగిన ఈ రైలు ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. పవర్ కార్, ఇంజిన్‌తో పాటు ఎనిమిది కోచ్‌లు పట్టాలు తప్పాయన్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందగానే.. సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు. ఈ ఘటనతో లుమ్‌డింగ్-బాదర్‌పూర్ సింగిల్-లైన్ హిల్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు వెల్లడించారు.ఈ ప్రమాదం గురువారం మధ్యాహ్నం 3.55 గంటలకు జరిగింది. అగర్తల, ముంబైలోని లోకమాన్య తిలక్ టెర్మినస్ మధ్య నడుస్తున్న రైలు డిబాలాంగ్ స్టేషన్ గుండా వెళుతుండగా పట్టాలు తప్పింది. అయితే పట్టాలు తప్పిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న తరువాత అసోం సీఎం హిమంత విశ్వ శర్మ కూడా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రయాణికులకు పెద్దగా నష్టం జరగలేదని, ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో తాను రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి ముందు అగర్తల-లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ గురువారం ఉదయం బయలుదేరింది. ఈ ఘటన నేపథ్యంలో రైల్వే అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపడుతున్నారు. దీంతో లుమ్డింగ్ బదర్‌పూర్ సింగిల్ లైన్ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రజలు సహాయం, అదనపు సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 03674 263120, 03674 263126లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. అయితే అసలు రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## ఎపిలో పెట్టుబడులకు వేట

### 25 నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

### ఐటి సినర్జీ కాన్ఫరెన్స్‌కు హాజరు



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఏపీలో పెట్టుబడులపై ఈ నెల 25 నుంచి మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించనున్నారు. నవంబర్ ఒకటో తేదీ వరకు శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో లోకేశ్ పర్యటించనున్నారు. ఈ నెల 25 తేదీన అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగే ఐటీ సినర్జీ కాన్ఫరెన్సుకు మంత్రి హాజరు కానున్నారు. ఏపీలో పెట్టుబడులపై ప్రముఖ కంపెనీలతో మంత్రి లోకేశ్ భేటీ కానున్నారు. నారా లోకేష్ వెంట సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, ఏపీఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ వెళ్లనున్నారు. అప్పటి వరకూ ఏపీఈడీబీ సీఈఓగా సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి సురేష్ కుమార్‌కు ఆ బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త పాలసీలతో ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతున్న సంగతి తెలిసిందే. బెస్ట్ పారిశ్రామిక పాలసీలతో ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు సిద్ధంగా ఉందంటూ ముఖ్యమంత్రి ట్వీట్ కూడా చేశారు. ఏపీలో కార్యకలాపాలకు పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ స్వాగతం అంటూ ముఖ్యమంత్రి స్వాగతం పలికారు. సమర్థులైన యువత, స్నేహ పూర్వక ప్రభుత్వం, మౌలిక సదుపాయాలతో పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులతో మీ వ్యాపారం పెరుగుతుంది.మా రాష్ట్రం వృద్ధి చెందుతుంది అంటూ పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం పలికారు. ఈ క్రమంలోనే లోకేశ్ అమెరికా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆయన మంత్రిగా బాధ్యత స్వీకరించిన తర్వాత తొలిసారి అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. ఏపీలో పెట్టుబడులను తీసుకుని రావాలని తద్వారా ఏపీలో ఉపాధి కల్పన అవకాశాలను పెంచాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది.

క్రైమ్ మిర్రర్ Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# బంగారంపై పెట్టుబడి పెడుతున్నారా.. అయితే ఇలా చేయండి..

## అధిక ధరల నేపథ్యంలో నిపుణుల సూచనలివీ..



మార్కెట్‌లో బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. మునుపెన్నడూలేని రికార్డు స్థాయిల్లో కదలాడుతున్నాయి. ఈ క్రమంలో మదుపరులు సైతం పుత్తడిపై పెట్టుబడులకు అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. అయితే మార్కెట్ విశ్లేషకులు మాత్రం అతిగా స్పందించడం తొందరపాటేనంటున్నారు. రాబోయే నెలల్లో ఒకేసారి పెద్ద ఎత్తున పెట్టుబడులకు దూరంగా ఉండాలని సలహా ఇస్తున్నారు.

**ఎందుకిలా?**

ప్రస్తుతం పసిడి ధరలు ఆల్‌టైమ్ హై స్థాయి దరిదాపుల్లో ఉన్నాయి. దీంతో ముున్ముందు ఈ ధరల్లో దిద్దుబాటుకు అవకాశాలున్నాయని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే జరిగితే అధిక ధరల వద్ద పెట్టుబడులు పెట్టిన మదుపరులకు నష్టాలు తప్పవు. అందుకే గోల్డ్ పోర్ట్‌ఫోలియో పరిమాణాన్ని ఇన్వెస్టర్లు తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలంలో గోల్డ్ మార్కెట్ బుల్లిష్‌గానే ఉండే వీలున్నా.. షార్ట్-టర్మ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారం ఉందని అంటున్నారు. దీనివల్ల ఒక రకమైన అయోమయం ఇన్వెస్టర్లలో నెలకొనవచ్చని, ఇది ఆకస్మిక క్రయవిక్రయాలకు దారితీయవచ్చని, అదంత మంచి పరిణామం కాదని వారు పేర్కొంటున్నారు.

**భారీగా వద్దు..**

బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకొనేవారు తమ దగ్గరున్న మొత్తం నగదు నిల్వలను అందుకే వినియోగించవద్దని, కొద్ది మొత్తాలతోనే సదరు ఇన్వెస్ట్‌మెంట్లకు దిగాలని ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. దేశీయంగా గడిచిన నెల రోజుల్లో గోల్డ్ రేట్లు డాలర్ల రూపేణా 6.3 శాతం, రూపాయల్లో 7.1 శాతం ఎగిశాయి. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 0.7 శాతం పడిపోయింది. ఇక గత ఏడాదితో పోల్చితే ఇప్పుడున్న బంగారం ధర డాలర్లలో 21.2 శాతం, రూపాయల్లో 28.8 శాతం ఎక్కువ. ఇక నిఫ్టీ 15.3 శాతం పెరిగింది. దీన్ని చూసి చాలామంది స్టాక్ మార్కెట్లలో మదుపు కంటే బంగారంపై పెట్టుబడులే ఉత్తమమని భావిస్తున్నారు. అందుకే ఇటీవలికాలంలో గోల్డ్‌పై ఇన్వెస్ట్‌మెంట్స్ క్రమేణా పెరిగిపోతున్నాయి.

**7 శాతం డౌన్?**

వచ్చే 3-4 నెలల్లో బంగారం ధరలు 5 నుంచి 7 శాతం మేరకు పడిపోవచ్చని, అందుకే అతిగా పెట్టుబడులు మానుకోవడమే మంచిదన్న అభిప్రాయాన్ని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బులియన్ అనలిస్ట్ మానవ్ మోదీ చెప్తున్నారు. ఈ క్రమంలోనే రాబోయే 3-6 నెలల్లో పసిడిపై పెట్టుబడులను సందర్భానుసారం పెడుతూపోవాలని సూచిస్తున్నారు. అయితే వచ్చే రెండేండ్లలో తులం ధర 86వేల మార్కును తాకవచ్చనీ మోదీ అంచనా వేస్తున్నారు. మరోవైపు అమెరికా ఎన్నికల దృష్ట్యా ఈక్విటీ మార్కెట్లు మరింత ఆటుపోట్లకు లోను కావచ్చని కనుక పసిడిపై పెట్టుబడులు పెద్దగా నష్టాల్ని తెచ్చిపెట్టకపోవచ్చని నిప్పాన్ ఇండియా మ్యూచువల్ ఫండ్‌లో ఫండ్ మేనేజర్, కమోడిటీస్ విభాగం అధిపతి విక్రమ్ ధావన్ అంటున్నారు. అయితే స్వల్పకాలంలో ధరల్లో హెచ్చుతగ్గులు బాగా ఉంటాయని, ఈ పరిస్థితులను అధిగమిస్తే అంతా ఓకేనన్న అభిప్రాయాన్ని కనబరుస్తున్నారు. ఇక అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు, భౌగోళిక-రాజకీయ అనిశ్చిత పరిస్థితులూ బంగారం ధరలను ఎగదోయవచ్చన్న అంచనాలున్నాయి.



## బజాజ్ ఆటో రివర్స్‌గేర్.. చేతక్ అమ్మకాలు సూపర్

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 1,385 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు, డిఫర్డ్ ట్యాక్స్‌కు పెరిగిన కేటాయింపులు ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం రూ.10,838 కోట్ల నుంచి రూ. 13,247 కోట్లకు జంప్ చేసింది. మొత్తం వ్యయాలు రూ. 8,806 కోట్ల నుంచి రూ. 10,767 కోట్లకు పెరిగాయి. ఈ క్యూ2లో బజాజ్ ఆటో స్టాండెలోన్ నికర లాభం 9 శాతం వృద్ధితో రూ. 2,005 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 10,777 కోట్ల నుంచి రూ. 13,127 కోట్లకు బలపడింది. ఈ కాలంలో వాహన విక్రయాలు 16 శాతం ఎగసి 12,21,504 యూనిట్లకు చేరాయి. దేశీ అమ్మకాలు 26 శాతం జంప్‌చేసి 6,36,801 యూనిట్లను తాకగా.. ఎగుమతులు 5 శాతం పుంజుకుని 3,96,407 యూనిట్లుగా నమోదయ్యాయి. కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ చేతక్ 70,000 యూనిట్ల అమ్మకాలు సాధించింది.


## ఇసుజు డీ-మ్యాక్స్ ఆంబులెన్స్: ధర ఎంతంటే..

ఇసుజు మోటార్స్ ఇండియా ఏఐఎస్-125 టైప్ సీ స్పెసిఫికేషన్‌లకు అనుగుణంగా 'డీ-మ్యాక్స్ అంబులెన్స్' లాంచ్ చేసింది. ఈ అంబులెన్స్ రోగులను తరలించే సమయంలో భద్రతను అందించేలా తయారైంది. దీని ప్రారంభ ధర రూ. 25.99 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఇసుజు డీ-మ్యాక్స్ అంబులెన్స్‌లో %=4జు% 1.9-లీటర్, 4-సిలిండర్ వీజీఎస్ టర్బో ఇంటర్‌కూల్డ్ ఇంజిన్ ఉంటుంది. ఇది 120 కేడబ్ల్యు పవర్, 360 ఎన్‌ఎమ్ టార్క్ అందిస్తుంది. ఈ అంబులెన్స్ గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తగిన విధంగా ఉండేలా దృఢంగా నిర్మితమై ఉంది.ఇసుజు డీ-మ్యాక్స్ అంబులెన్స్‌లో.. ఏబీఎస్ విత్ ఈబీడీ, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటి కంట్రోల్, హిల్ డీసెంట్ కంట్రోల్, ఎమర్జెన్సీ బ్రేక్ అసిస్ట్, ఇంటలిజెంట్ బ్రేక్ ఓవర్-రైడ్ సిస్టమ్ వంటి సేఫ్టీ ఫీచర్స్ ఉన్నాయి. ఇవి కాకుండా డ్రైవర్ అండ్ కో-డ్రైవర్ సీట్లకు 3-పాయింట్ సీట్ బెల్ట్స్, సీట్ బెల్ట్ వార్నింగ్ సిస్టమ్, డ్రైవర్ %డ% కో-డ్రైవర్ కొరకు ఎయిర్ బ్యాగ్స్, ఫ్రంట్ క్యాబిన్ కొరకు కొలాప్సిబుల్ స్టీరింగ్ కాలమ్, సైడ్ ఇంట్రూషన్ ప్రొటక్షన్ బీమ్ వంటివి కూడా ఇందులో ఉన్నాయి.



## జీఎస్‌టీ రేట్లలో సెస్సు విలీనం!

### ప్రతిపాదనపై జీవోఎం చర్చ




న్యూఢిల్లీ: జీఎస్‌టీ కాంపెన్సేషన్ (పరిహారం) సెస్సును జీఎస్‌టీ రేట్లలో విలీనం చేసే ప్రతిపాదనపై మంత్రుల బృందం (జీవోఎం) చర్చించింది. జీఎస్‌టీ ఆరంభంలో రాష్ట్రాలు కోల్పోయే పన్నును భర్తీ చేసేందుకు వీలుగా సెస్సును ప్రవేశపెట్టడం తెలిసిందే. ఒక్కసారి విలీనంపై నిర్ణయం తీసుకున్న తర్వాత, ఈ సెస్సు నుంచి మళ్లీ క్రమంలో మరే వస్తువును లగ్జరీ లేదా సిన్ విభాగం కిందకు చేర్చకూడదని రాష్ట్రాలు సూచించాయి. 2026 మార్చిలో కాంపెన్సేషన్ సెస్సు ముగిసిన అనంతరం దాన్ని జీఎస్‌టీ రేట్లలో కలిపేయాలని.. అప్పటి వరకు ఏ వస్తువులకు సెస్సు అమలు చేశారో వాటికి సంబంధించి ప్రత్యేక రేటును జీఎస్‌టీలో ప్రవేశపెట్టాలన్నది రాష్ట్రాల అభిప్రాయంగా ఉంది. "జీఎస్‌టీ కాంపెన్సేషన్ సెస్సు ముగింపునకు వస్తోంది. దీని భవిష్యత్ ఏంటన్న దానిపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రతి రాష్ట్రం తమ అభిప్రాయాలను తెలియజేసింది. ఇందుకు సంబంధించి ఇది తొలి సమావేశం"అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రకటించారు. మంత్రుల బృందానికి ఆయనే నేతృత్వం వహిస్తున్నారు. సెస్సును కొనసాగించాలా లేదంటే దాన్ని పన్ను కిందకు మార్చాలా? లగ్జరీ విభాగంలో మార్పులు చేయాలా? అన్న దానిపై చర్చలు కొనసాగుతున్నట్టు చెప్పారు. జీఎస్‌టీ కాంపెన్సేషన్ సెస్సుపై నవంబర్ రెండో వారంలో జీవోఎం మరోసారి సమావేశమై చర్చించనుంది. అసోం, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల మంత్రులు జీవోఎంలో సభ్యులుగా ఉన్నారు.

## భారీగా పెరిగిన వెహికల్ సేల్స్: ఎస్ఐఏఎమ్ రిపోర్ట్



సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ సెప్టెంబర్ 2024లో ఆటో పరిశ్రమ విక్రయాల సంఖ్యను విడుదల చేసింది. గత నెలలో వెహికల్ సేల్స్ 24,62,431 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ అమ్మకాలు సెప్టెంబర్ 2023 కంటే 12.6 శాతం ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి.సెప్టెంబర్ 2024లో మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 3,56,752 యూనిట్లు. 2023లో ఇదే నెలలో ప్యాసింజర్ వెహికల్ సేల్స్ 3,61,717 యూనిట్లు. 2023 సెప్టెంబర్ నెల కంటే కూడా 2024 సెప్టెంబర్ నెలలో ప్యాసింజర్ వెహికల్ సేల్స్ కొంత మందగించాయి. సెప్టెంబర్ 2024లో మొత్తం ద్విచక్ర వాహనాల అమ్మకాలు 20,25,993 యూనిట్లు. కాగా ఇదే నెల 2023లో టూ వీలర్ సేల్స్ 17,49,794 యూనిట్లు. దీన్ని బట్టి చూస్తే గత నెలలో టూ వీలర్ సేల్స్ కూడా గణనీయంగా పెరిగాయని తెలుస్తోంది.

వాహనాల అమ్మకాలను గురించి ఎస్ఐఏఎమ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర మాట్లాడుతూ.. మొత్తం భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ 2023-24 ఆర్థిక సంవత్సరం కంటే కూడా 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొంత ఊపందుకుంది. టూ వీలర్, త్రీ వీలర్ సేల్స్ వరుసగా 12.6 శాతం, 6.6 శాతం వృద్ధి చెందాయి. అయితే ప్యాసింజర్ వెహికల్స్, కమర్షియల్ వెహికల్స్ అమ్మకాలు మాత్రం కొంత క్షీణతను నమోదు చేశాయని పేర్కొన్నారు.

# 'స్మార్ట్' ఉన్నా ఫీచర్ ఫోన్లను ఎందుకు కొంటున్నారు?

టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ స్మార్ట్ ఫోన్లకు భారీగా డిమాండ్ ఏర్పడుతుంది. చాలా కంపెనీలు మొబైల్ ఫీచర్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పరిచయం చేస్తున్నాయి. దాంతో మొబైల్ ఫోన్లను మరింత స్మార్ట్‌గా మార్చాలని విభిన్న ప్రయోగాలు చేపడుతున్నాయి. మరోపక్క ప్రపంచవ్యాప్తంగా ఫీచర్ ఫోన్లకు ఆదరణ మాత్రం తగ్గడంలేదు. అయితే వివిధ కారణాలతో చాలామంది ఇంకా ఫీచర్ ఫోన్లవైపే మొగ్గు చూపుతున్నారు. అందుకుగల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు.

- ప్రాథమిక కమ్యునికేషన్ కోసం ఈ ఫీచర్ ఫోన్‌లను ఎక్కువగా వాడుతున్నారు.
- స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే బ్యాటరీ లైఫ్ అధికంగా ఉంటుంది.కేవలం కాల్స్, టెక్ట్స్ మెసేజ్‌లు చేయడానికి వీలుగా దీన్ని అధికంగా వాడుతున్నారు.
- కొన్ని ఆఫీసుల్లో వివిధ కారణాల వల్ల స్మార్ట్‌ఫోన్లను అనుమతించడం లేదు. దాంతో చాలామంది ఉద్యోగులు తప్పక ఈ ఫీచర్ ఫోన్‌ను కొనుగోలు చేస్తున్నారు.
- స్మార్ట్‌ఫోన్ ఉన్నా కూడా నిత్యం దూర ప్రయాణాలు చేసేవారు బ్యాకప్ కోసం దీన్ని వినియోగిస్తున్నారు.
- ఫోన్లకు సంబంధించి సింప్లిసిటీని ఇష్టపడేవారు వీటిని కొనుగోలు చేస్తున్నారు.
- ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నవారు తక్కువ ఖర్చుతో కూడిన ఈ ఫీచర్ ఫోన్లను తీసుకుంటున్నారు. ఒకవేళ పిల్లలు ఫోన్ కావాలని మారాం చేసి తీసుకుని కిందపడేసినా పెద్దగా నష్టం ఉండదు.
- వృద్ధులు, కంటి చూపు సరిగా లేనివారు ఈ ఫీచర్ ఫోన్లను సులువుగా వినియోగించవచ్చు.
- ఆర్థిక స్థోమత సరిగాలేని వారు ఈ ఫీచర్ ఫోన్లను ఎంచుకుంటున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా ఈ ఫీచర్ ఫోన్ మార్కెట్ 2018-2030 మధ్య కాలంలో ఏటా 3.5 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని పలు నివేదికలు చెబుతున్నాయి. భారత్‌లో 2023 రెండో త్రైమాసికం లెక్కల ప్రకారం అంతకుముందు ఏడాది అదే త్రైమాసికంతో పోలిస్తే తొమ్మిది శాతం ఈ ఫోన్ల అమ్మకాలు పెరిగాయి.
- ఇటీవల రిలయన్స్ జియో కంపెనీ 4జీ నెట్‌వర్క్ సదుపాయం కలిగిన ఫీచర్ ఫోన్లను విడుదల చేసింది. ఇటీవల ఢిల్లీలో ప్రారంభమైన ఇండియన్ మొబైల్ కాంగ్రెస్(ఐఎంసీ) 2024 సమావేశంలో భాగంగా ఈ ఫోన్లను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. వీటి ధర రూ.1,099గా నిర్ణయించారు. అయితే రిటైలరనుబట్టి ఈ ధరలో మార్పులుంటాయని గమనించాలి.



## రైల్ రిజర్వేషన్ కాల వ్యవధిలో మార్పులు

### 120 రోజుల నుంచి 60 రోజులకు కుదింపు

### నవంబర్ ఒకటో తేది నుంచి అమలు



**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** టికెట్ రిజర్వేషన్లకు సంబంధించి భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రయాణానికి 120 రోజుల ముందుగానే బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండగా.. దానిని 60 రోజులకు కుదించింది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ నిబంధనల్లో మార్పులు చేసింది. నవంబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది. అయితే, ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి మాత్రం ఎటువంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. కొత్త నిబంధన నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నప్పటికీ.. అక్టోబర్ 31 వరకు బుకింగ్ చేసుకునే వారికి పాత నిబంధన వర్తిస్తుంది. తాజ్ ఎక్స్‌ప్రెస్ , గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ల బుకింగ్‌లో ఎటువంటి మార్పూ లేదు. ఇప్పటికే వాటిలో బుకింగ్ వ్యవధి తక్కువగా ఉంది. ఇక విదేశీ పర్యటకులు మాత్రం 365 రోజుల ముందుగానే టికెట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా.. ఇందులోనూ ఎలాంటి మార్పూ లేదు. ఇదిలా ఉంటే, గతంలోనూ రైల్వే ముందస్తు బుకింగ్ ప్రయాణానికి 60 రోజుల ముందే ఉండేది. దానిని 120 రోజులకు పెంచిన భారతీయ రైల్వే.. తాజాగా మళ్లీ మునుపటి వ్యవధికే మార్పు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ షేరు విలువ 2 శాతం మేర క్షీణించి రూ.873 వద్ద ట్రేడవుతోంది. గడువు కుదింపు వల్ల ఆ మేర క్యాన్సిలేషన్లు తగ్గి ఐఆర్‌సీటీసీకి ఆదాయం తగ్గే అవకాశం ఉండడమే దీనికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.

## చెన్నైకి భారీ వర్ష సూచన

### ఇల్లను వదిలి హోటళ్లు చూసుకుంటున్న జనం

**చెన్నై, (క్రైమ్ మిర్రర్):** చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాసవంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. బెంగళూరు ఇందిరానగర్ సమీప మెట్రో మార్గంపై ఓ చెట్టు కూలడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## మహర్షి వాల్మీకి జీవితం గొప్ప స్ఫూర్తి

### జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా



**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** మహర్షి వాల్మీకి జీవితం.. ఆయన సమాజానికి అందించిన రామాయణ మహా కావ్యం గొప్ప స్ఫూర్తి పథమని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ వాల్మీకి.. మహామునిగా, కవిగా, మహర్షిగా తన జీవితాన్ని మలుచుకోవడమే కాకుండా ఆత్మీయమైన, అద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని ఈ సమాజానికి అందించడం ద్వారా గొప్ప సందేశాన్ని అందించారన్నారు. మనిషి సంకల్పిస్తే ఏదైనా సాధించగలమని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మహర్షి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో పయనించాల్సిన అవశ్యకత ప్రస్తుత సమాజానికి ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్‌ఏ అజీజ్, డీసీహెచ్‌ఎస్ డా. బీసీకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కొరియా శత్రుదేశమే

### ఉత్తర కొరియా రాజ్యాంగ సవరణ

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య శత్రుత్వం ఇప్పటిది కాదు. ఇరుదేశాల మధ్య వైరం నేటికీ కొనసాగుతోంది. ఈక్రమంలో ఉత్తర కొరియా కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ కొరియాను శత్రుదేశంగా పరిగణిస్తూ తమ రాజ్యాంగంలో మార్పులు చేపట్టినట్లు ఉత్తర కొరియా తాజాగా వెల్లడించింది. 1991లో ఉత్తర– దక్షిణకొరియా దేశాల మధ్య జరిగిన కీలక ఒప్పందాన్ని కిమ్ సర్కారు రద్దు చేసుకోవాలని నిర్ణయించింది. అందులోభాగంగా తమ రాజ్యాంగంలో న్యాయపరమైన సవరణలు చేయల్సిఉందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ ఏడాది ప్రారంభంలో వ్యాఖ్యానించారు. అధ్యక్షుడి ఆదేశాల మేరకే రాజ్యాంగంలో మార్పులు చేసినట్లు పాగ్యాంగ్ వెల్లడించింది. దక్షిణ కొరియాను శత్రుదేశంగా పరిగణించడం అనివార్యమైన, న్యాయపరమైన చర్యగా కిమ్ సర్కార్ పేర్కొంది. అయితే ఈ రాజ్యాంగ సవరణలకు సంబంధించిన మరిన్ని విషయాలు వెల్లడికావాల్సి ఉంది. ఇటీవల ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మే చివరివారం నుంచి దక్షిణ కొరియా గగనతలంపైకి వేల సంఖ్యలో చెత్త బెలూన్లు పంపుతుంది. ఈక్రమంలోనే దక్షిణ కొరియాతో తమకున్న సరిహద్దును పూర్తిగా మూసివేస్తున్నట్లు కిమ్ సర్కారు నిర్ణయించింది. అందులోభాగంగా ఇరుదేశాలను కలిపే రోడ్లు, రైల్వే మార్గాలను ఉత్తర కొరియా బాంబులతో పేల్చివేసింది. అయితే.. ఈ రోడ్లు, రైల్వే మార్గాల తొలగింపును సైన్యం దశలవారీగా పూర్తి చేస్తుందని వెల్లడించింది. మరోవైపు ఉత్తరకొరియా సరిహద్దుల వెంబడి తన సైన్యాన్ని పటిష్టం చేస్తుంది.

# టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత

### మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిలీ (క్రైమ్ మిర్రర్):** టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతూనే ఉంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా మరింతమంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లేఆఫ్‌ల విషయాన్ని కంపెనీ ధ్రువీకరించినప్పటికీ ఎంత సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తుందనే సమాచారాన్ని మాత్రం వెల్లడించలేదు. మెటా పరిధిలో ఉన్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, వర్చువల్ రియాలిటీపై పనిచేస్తున్న రియాలిటీ ల్యాబ్.. ఇలా అన్ని వ్యాపారాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోనున్నట్లు తెలుస్తోంది. రిక్రూటింగ్, లీగల్ ఆపరేషన్, డిజైన్... వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులోభాగంగానే ఈ



తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2022లో మెటా ఏకంగా 11వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గతేడాదిలో మరో 10వేల మందిని ఇంటికి పంపింది. తాజాగా మరో రౌండ్ లేఆఫ్‌లకు సిద్ధమైంది. అయితే ఈసారి తొలగింపులు తక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మెటా నుంచి లేఆఫ్‌కు గురైనట్లు కొందరు ఉద్యోగులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఇదిలాఉండగా.. టెక్ కంపెనీలు ఆర్థిక ఒత్తిళ్లు, సైబర్ సెక్యూరిటీపై పెట్టుబడులు, ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడం కోసం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఇక ఖర్చుల్ని తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఇంటెల్ (ఎనిబి।), సిస్కో (అతిబఇనీ), ఐబీఐ కంపెనీలు పెద్ద ఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటెల్ ఏకంగా 15శాతం మంది ఉద్యోగులను తగ్గించుకుంది. ఇలా ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయి.

## సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చే యత్నం

### విచారణ అనంతరం మీడియాతో సజ్జల



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో నెలకొన్న సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి వైసీపీ నాయకులపై ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తుందని వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. టీడీపీ కార్యాలయంపై దాడికేసులో మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కేవలం వైసీపీ (జఅఖ) పార్టీకి చెందిన నాయకులపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి తప్పుడు వాంగ్మూలం సృష్టించి వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారని మండిపడ్డారు. ఘటన జరిగిన రోజున బద్వేలులో జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఉన్నానని, దాడికేసులో తన ప్రమేయం లేదని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు స్వేచ్ఛగా తిరుగకుండా ఆటంకాలు కలిగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వైసీపీ నాయకులు ఏం చేసినా వైసీపీ నాయకులు బెదిరిపోరని, కళ్లు మూసుకుని, తెరుచుకునే లోగా ఎన్నికలు వస్తాయని గుర్తించుకోవాలని తెలిపారు. వైఎస్ జగన్ పాలనలో ఆధారాలు లేకుండా ఎవరిపై కేసులు నమోదు చేయలేదని వెల్లడించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తప్పుడు ఆలోచనలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని భావించడం ప్రజాస్వామ్యంలో సరియైనది కాదని అన్నారు.

## తిరిగా వైకాపాలోకి టిడిపి నేత

### జగన్ సమక్షంలో కండువా కప్పుకున్న మురళీకృష్ణంరాజు



**కాకినాడ, (క్రైమ్ మిర్రర్):** ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సిపి పార్టీ ఘోరంగా ఓడిపోయి,. ఆ పార్టీ కేవలం 11 సీట్లకే పరిమితమైంది. దీంతో ఆ పార్టీలో నేతలు అధికారంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలోకి చేరుతున్నారు. అయితే అందుకు భిన్నంగా కాకినాడ జిల్లా టిడిపి కీలక నేతగా ఉన్న ముదునూరి మురళీకృష్ణంరాజు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి.. గురువారం వైఎస్సార్‌సిపి పార్టీలో చేరి అందరికీ షాకిచ్చారు. టిడిపి నేతల విమర్శల వల్లే ఆయన వైఎస్సార్‌సిపిలోకి చేరినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సిపి పార్టీలోకి చేరిన మురళృకృష్ణంరాజుకి ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం పనిచేస్తానని మురళీకృష్ణంరాజు చెప్పారు.ఃూగా, ముదునూరి మురళీకష్ణంరాజు 2023 ఏప్రిల్‌లో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయన్ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, అమలాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా నియమిచంచారు. అయితే ఆయన పార్టీలో చేరినప్పటి నుంచి ప్రత్తిపాడులో విభేదాలు మొదలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ మురళీకృష్ణంరాజు ప్రత్తిపాడు టిడిపి అభ్యర్థి పరుపుల సత్యప్రభ కోసం పనిచేయకుండా.. వైఎస్సార్‌సిపి ఎమ్మెల్యే, ఎంపీల కోసం పనిచేశారని టిడిపి కేడర్ విమర్శించింది. అలాగే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ఆయన్ను నియమించిన పదవుల నుంచి తొలగించాలని టిడిపి కేడర్ అధిష్టానంపై ఒత్తిడి తెస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే తాజాగా ఆయన ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సిపి పార్టీలో చేరినట్లు చెబుతున్నారు.

## పౌరసత్వ చట్టం సెక్షన్6ఏ రాజ్యాంగబద్ధమే

### సమర్థించిన సుప్రీం ధర్మాసనం


**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్6ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయులను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ అక్రమ వలసలకు అసోం అకార్డ్ రాజకీయ పరిష్కారమని.. సెక్షన్–6ఎ అనేది చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేందుకు మెజార్టీతో కూడిన పార్లమెంట్‌కు ఆ శక్తి ఉందన్నారు.మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్‌కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదేనన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని చెబుతోందని.. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ రూల్‌ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై



ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని ఆయా గ్రూపులు వాదించాయి.

# రజినీ మీదా నెగెటివ్ ట్రెండా?

సూపర్ స్టార్ రజినీకాంత్‌ను ఆయన అభిమానులు ఎంతగా అభిమానిస్తారో, ఆరాధిస్తారో తెలిసిందే. ఐతే ఎంత ఎదిగినా ఒదిగి ఉండడమే కాక..వివాదాలకు దూరంగా ఉంటూ.. సున్నితంగా మాట్లాడే రజినీని ఇతర హీరోల అభిమానులు కూడా ఎంతో గౌరవిస్తుంటారు. ఆయన్ని నో నెగెటివిటీ స్టార్‌గా చెప్పొచ్చు. కానీ సోషల్ మీడియా పుణ్యమా అని అలాంటి హీరో మీద కూడా అదే పనిగా నెగెటివ్ ట్రెండ్ చేసే పరిస్థితులు వచ్చేశాయి. సూపర్ స్టార్ తాజాగా వేట్టయన్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. జై భీమ్ లాంటి గొప్ప సినిమా తీసిన టీజీ జ్ఞానవేల్ రూపొందించిన చిత్రమిది. జై భీమ్



తరహాలోనే మరోసారి సామాజిక అంశాలతో కథను అల్లుకున్నాడు జ్ఞానవేల్. రజినీ కూడా తన ఇమేజ్‌ను పక్కన పెట్టి విభిన్నమైన ప్రయత్నం చేశాడు. ఐతే సినిమాకు యావరేజ్ టాక్ వచ్చింది. కానీ ఇది తీసి పడేయదగ్గ మూవీ అయితే కాదు. ఐతే సినిమా నచ్చకపోతే బాలేదు అని చెప్పాలి కానీ.. అదే పనిగా సోషల్ మీడియాలో దాన్ని ట్రోల్ చేయడం, నెగెటివ్ ట్రెండ్ చేయడమే విడ్డూరం. వేట్టయన్ సినిమా చూసి తాము మానసిక ప్రశాంతత కోల్పోయామని.. టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒక రోజంతా నెగెటివ్ ట్రెండ్ చేశారు. %=వటబఅఐజమ్ఖఅఎత్అఒఎవిఎశీఅవ౦% అనే హ్యాష్ ట్యాగ్ నిన్న ఇండియా లెవెల్లో ట్రెండ్ అయింది. ఈ హ్యాష్ ట్యాగ్ మీద దారుణమైన పోస్టులు పెట్టారు. రజినీని కించపరిచే ప్రయత్నం చేశారు. ఇది ప్రస్తుతం తమిళంలో నంబర్ వన్ హీరో అనదగ్గ విజయ్ అభిమానుల పనే అని భావిస్తున్నారు. కొన్నేళ్లుగా తమిళంలో విజయ్ హవా నడుస్తోంది. బాక్సాఫీస్ లెక్కల్లో రజినీని విజయ్ అధిగమించేశాడు.





# ప్రియదర్శితో సమంత మూవీ..

స్టార్ బ్యూటీ సమంత గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. మయోసైటిస్ కారణంగా కొన్నాళ్లు సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె ప్రస్తుతం మళ్లీ రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది. ప్రస్తుతం సెలెక్టివ్ గా సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు చేసుకుంటూ వెళ్తోంది. తాజాగా ఆమె నటిస్తున్న "సిటాడెల్: హనీ బన్నీ" వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఇదిలా ఉండగా, ఆమె సెలెక్టివ్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. ఆమె చివరి చిత్రం విజయ్ దేవరకొండతో తీసిన ఖుషి సినిమా. ఇది బాక్సాపీసు వద్ద యావరేజ్ గా నిలిచింది. తన సొంత ప్రొడక్షన్ హౌస్ ట్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై తనే లీడ్ క్యారెక్టర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించింది. తాజాగా మరో సినిమాను నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఆమె హీరోయిన్‌గా నటించబోతుందట.


# హిందీలో హిట్.. మిగతా చోట్ల లైట్

టాలీవుడ్ నుంచి కల్కి తర్వాత అత్యధిక అంచనాలతో విడుదలైన పాన్ ఇండియా సినిమా.. దేవర. సెప్టెంబరు 27న ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించింది. టాక్ కొంచెం అటు ఇటుగా ఉన్నా.. ఈ చిత్రం ఓపెనింగ్ వీకెండ్లో భారీ వసూళ్లే సాధించింది. ఆ తర్వాత కొంచెం డల్ అయినట్లు కనిపించినా.. దసరా సెలవులను ఉపయోగించుకుని నిలకగా కలెక్షన్లు రాబట్టింది. ఇంకా కూడా ఈ సినిమా రన్ కొనసాగుతోంది. కాకపోతే ప్రస్తుతం వసూళ్లు నామమాత్రంగా ఉన్నాయి. ఐతే పేరుకు పాన్ ఇండియా సినిమా కానీ దేవర మేజర్ వసూళ్లను తెలుగు వెర్షన్ నుంచే రాబట్టింది. 80 శాతం పైగా వసూళ్లు తెలుగు నుంచి వచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు యుఎస్‌లో, కర్ణాటకలో తెలుగు వెర్షన్ అదరగొట్టింది. కానీ సౌత్‌లో మిగతా చోట్ల దేవర పెద్దగా ప్రభావం చూపలేదు. తమిళ జనాలు దేవరను అంతగా పట్టించుకోలేదు. అక్కడ వసూళ్లు నామమాత్రం. మలయాళంలోనూ పరిస్థితి అంతంతమాత్రమే. దేవర తెలుగులో కాకుండా ప్రభావం చూపింది హిందీలో మాత్రమే. అక్కడ ఈ సినిమా హిట్ రేంజిని అందుకుంది. పెద్దగా బజ్ లేకుండా రిలీజైన దేవర హిందీ వెర్షన్‌కు మాస్ నుంచి మంచి రెస్పాన్సే వచ్చింది. తొలి వీకెండ్లో రూ.25 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది దేవర. ఆ ఊపు చూస్తే వంద కోట్ల మార్కును కూడా అందుకుంటుందా అనే చర్చ నడిచింది. కానీ దేవర ప్రస్తుతానికి హిందీలో రూ.65 కోట్లే కలెక్ట్ చేయగలిగింది. కానీ ఇది కూడా చిన్న నంబరేమీ కాదు. విడుదలకు ముందు దేవరకు నార్త్ ఇండియాలో బజ్ కనిపించలేదు. అడ్వాన్స్ బుకింగ్స్ నామమాత్రంగా కనిపించాయి. కానీ తొలి రోజు నుంచి సినిమా బాక్సాఫీస్ దగ్గర బలంగానే నిలబడింది. యావరేజ్ కంటెంట్ ఉన్న సినిమాతో ఈ వసూళ్లు సాధించడం విశేషమే. తెలుగులో దేవర చాలా చోట్ల బయ్యర్లకు లాభాలు అందించింది. కొన్ని ఏరియాల్లో జస్ట్ బ్రేక్ ఈవెన్ అయింది. ఓవరాల్‌గా దేవరకు సంతృప్తికర ఫలితం వచ్చినట్లే.



# పోస్టర్లు, టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి

మున్నా కాశి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా 'సి 202'. గోవా బ్యూటీ షారోన్ రియా ఫెర్నాండెజ్ హీరోయిన్‌గా నటించారు. మైటీ ఒక్ పిక్చర్స్ బ్యానర్‌పై మనోహరి కేఏ ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. ట్రైలర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేకుండా.. కేవలం నటీనటుల హావభావాలతోనే అందరినీ ఆకట్టుకున్నారు. సి 202 చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని 'ఎ' సర్టిఫికెట్‌ను పొందింది. ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తవ్వడంతో చిత్ర యూనిట్ రిలీజ్ డేట్ ప్రకటించారు. అక్టోబర్ 25న విడుదల చేస్తునట్లు ఓ పోస్టర్ వదిలారు. ట్రైలర్‌లో ఒక్క డైలాగ్ కూడా లేకుండా సీన్స్, సౌండ్ ఎఫెక్ట్స్ తోనే భయపెట్టిన ఈ సినిమా.. మరి థియేటర్‌లో ఏ రేంజ్‌లో భయపెడుతుందో చూడాలి. డిఫరెంట్ కాన్సెప్ట్ కథతో వస్తున్న ఈ సినిమాలో తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ, అర్చన ప్రధాన పాత్రల్లో నటించారు.





# రామ్ చరణ్ పెద్ద మనసు.. చిన్నారి ట్రీట్‌మెంట్ కోసం లక్షల్లో ఖర్చు



గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ పెద్ద మనసు చాటుకున్నాడు. మెగాస్టార్‌కు వారసుడిగానే కాకుండా సాయంలోనూ చిరంజీవికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నాడు. తన మంచి మనసుతో ఒక చిన్నారి ప్రాణాన్ని కాపాడి ప్రాణదాతగా నిలిచాడు. తమ కూతురు దక్కదని భావించిన ఆ తల్లిదండ్రులకు దేవుడిలా సాయం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. చిరంజీవి పుట్టినరోజు నాడే (ఆగష్టు 22) ఓ ఫోటో జర్నలిస్ట్ కుటుంబంలో చిన్నారి జన్మించింది. అయితే, పుట్టుకతోనే పల్మనరీ హైపర్‌టెన్షన్ (గుండె సంబంధిత) జబ్బుతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. పాప గుండెలో సమస్య ఉందని, బతకడం కష్టమని వైద్యులు చెప్పడంతో చిన్నారిని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. లక్షల్లో ఖర్చయ్యే వైద్యం చేయించే స్థోమత ఆ తండ్రికి లేకపోవడంతో సతమతమవుతున్నారు. తీవ్రమైన ఆవేదనతో దిక్కుతోచనిస్థితిలో ఉన్న వారి విషయం రామ్ చరణ్ దృష్టికి వెళ్లడంతో 53 రోజులపాటు చికిత్సకు సాయమందించారు. ఆపై చిన్నారి చికిత్స కోసం రక్తం, ప్లేట్‌లెట్లు వంటివి చిరంజీవి బ్లడ్ బ్యాంకు నుంచి సమకూర్చారు. ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారి డిశ్చార్జ్ అయ్యింది. తమ కూతురు ఇక దక్కదని ఆందోళన చెందిన ఆ తల్లిందండ్రుల్లో రామ్‌చరణ్ సంతోషం నింపారు.

# పెళ్లైన 12 ఏళ్లకు గుడ్‌న్యూస్ చెప్పిన స్టార్ హీరోయిన్



బాలీవుడ్ బ్యూటీ రాధికా ఆప్టే (39) బేబీ బంప్ ఫోటోతో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తన కొత్త సినిమా 'సిస్టర్ మిడ్‌నైట్' లండన్‌లో ప్రీమియర్ షో జరుగుతుండగా రాధికా ఆప్టే కూడా పాల్గొంది. కరణ్ కంధారి దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 19న డైరెక్టర్స్ ఫోర్ట్‌నైట్ కేన్స్‌లో ప్రదర్శించబడింది. 2024 కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ఈ చిత్రం రెండు విభాగాల్లో నామినేషన్ దక్కించుకుంది. అయితే, ఈ చిత్రం ఈ ఏడాది అక్టోబర్ 20న విడుదల కానుంది. రాధికా ఆప్టే అమ్మ కాబోతుంది. బేబీ బంప్‌తో ఉన్న ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. అయితే, తల్లి కాబోతున్న విషయాన్ని ఇప్పటివరకు ఆమె గోప్యంగానే ఉంచింది. నవంబర్ నెలలో పండంటి బిడ్డకు ఈ బ్యూటీ జన్మనివ్వనుంది. కెరీర్ పీక్‌స్టేజ్‌లో ఉన్న సమయంలోనే బ్రిటీష్ వయొలినిస్ట్ బెండిక్ట్ టేలర్‌ను పెళ్లాడింది. 2012లో వీరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.